

సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధతో ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటి వద్ద పెన్షన్లు అందిస్తూ 'పేదల సేవలో' కార్యక్రమాన్ని పండుగలా నిర్వహిస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు అండగా నిలుస్తూ వారి ఇంటి పెద్ద కొడుకుగా నిలిచారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


బుధవారం 30.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 160 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# పెత్తందార్లం కాదు... ప్రజలకు సేవకులం



ప్రజలు వేసిన ఓటు వృధా కాలేదు

నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన

ఉదయగిరి పల్లె పండుగ-3.0 బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**ఉదయగిరి, సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలకు సేవ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, తాము ప్రజలకు సేవకులమే తప్ప పెత్తందార్లం కాదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఉదయగిరి నియోజకవర్గం వరికుంటంపాడు మండలం, రామాపురం గ్రామంలో నిర్వహించిన పల్లె పండుగ-3.0 కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి రూ. 11,085 కోట్ల విలువైన గ్రామీణ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పల్లె పండుగ-3.0లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ. 2,700 కోట్లతో 6 వేల కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, రూ. 7,550 కోట్లతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనం చేశారు. అలాగే పాడి రైతుల కోసం రూ. 300 కోట్లతో 22 వేల మినీ గోకులాలు నిర్మాణం, రూ. 225 కోట్లతో 50 వేల ఎకరాల్లో ఉద్యాన తోటల పెంపకానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, రూ. 110 కోట్లతో వెయ్యి కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలకు పల్లె పండుగ ద్వారా నాందీ పలుకుతున్నామని తెలిపారు. ప్రతి ఇంటి ముందు సీసీ రోడ్ వేస్తున్నామని... రోడ్ల ఏర్పాటుతో రాకపోకలు సాఫీగా సాగుతాయని... ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో రూ. 50 వేల కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామని... పల్లెల్లోనూ కనివినీ

● మిగతా 2 లో



వీబీ జీ రాంజీ శ్రామికుల వద్దకెళ్లి శ్రమదానం చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మాధవ్

పల్లె పండుగ-3.0లో రూ.11,085 కోట్ల పనులకు శంకుస్థాపన

## పాలనలో కొత్త ఒరవడి.. నైపుణ్యాలే చోదకశక్తి

టెక్నాలజీతో పాలనా విధానాల సరళీకరణ

పౌరసేవల్లో నాణ్యతే ప్రామాణికం

**మిషన్ కర్మయోగి ప్రాంతీయ సదస్సులో సీఎం చంద్రబాబు**



**విజయవాడ, సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ ఫైల్):** దేశాభివృద్ధిలో వచ్చే 20 ఏళ్లు అత్యంత కీలకమని, ఈ కాలంలో ప్రభుత్వ వ్యవస్థలు, సంస్థల్లో విప్లవాత్మక మార్పులు రావాల్సిన అవసరం ఉందని ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలు వేగంగా మారుతున్నాయని, వాటికి అనుగుణంగా ప్రభుత్వ పాలనా విధానాలు, ప్రక్రియలు, ఉద్యోగుల నైపుణ్యాలు కూడా నిరంతరం మెరుగుపడాలని పేర్కొన్నారు. సాంకేతికతను వినియోగించుకోవడంతో పాటు పాత విధానాలు, అనవసర నిబంధనలను సరళీకరించి పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాధన శృంఖల-2026 మిషన్ కర్మయోగి ప్రాంతీయ సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు, శిక్షణ సంస్థల ప్రతినిధులు ఈ రెండు రోజుల సదస్సుకు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాల పెంపు,

మిగతా 2లో...

## ఏపీ విద్యా వ్యవస్థలో సంస్కరణలు భేష్

విద్యా సంస్కరణలను ప్రశంసించిన షణ్ముగం

డ్రాపౌట్ల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

డ్రగ్స్ నిర్మూలనకు సింగపూర్ మోడల్‌పై చర్చ

ఐటీఐలకు సింగపూర్ ఐటీఈతో అనుసంధానం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** మాదకద్రవ్యాల నివారణ, విద్యావ్యవస్థ బలోపేతం వంటి కీలక అంశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సింగపూర్ దేశాల నడుమ సమగ్ర ఆలోచనల మార్పిడి జరిగింది. మంగళవారం విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్, సింగపూర్ హోం, చట్టసభల మంత్రి కే.షణ్ముగంతో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానంతరం ఉభయ నేతలు రాష్ట్ర అభివృద్ధి, విద్యా సంస్కరణలు, సామాజిక భద్రతకు సంబంధించిన వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా ఏపీలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను,

మిగతా 2లో...

## రూ.35కే కేజీ ఉల్లిపాయలు



- ధరల స్థిరీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- తొలి దశలో విజయవాడలోని అన్ని రైతు బజార్లలో నేటి నుండి అమలు
- ఆధార్/రేషన్ కార్డు ఆధారంగా కుటుంబానికి నెలకు 2 కేజీలు
- ప్రజల డిమాండ్‌ను బట్టి రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్

**అమరావతి, సెప్టెంబర్ 29(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఉల్లిపాయల ధరల పెరుగుదల నేపథ్యంలో ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని నిర్ణయించింది.

మిగతా 3లో...

## అథ్లెటిక్స్‌లో భారత్‌కు తొలి స్వర్ణం



**ఐచి-నగోయా(జపాన్):** ఆసియా క్రీడలు 2026లో భారత్‌కు మరో రెండు స్వర్ణ పతకాలు దక్కాయి. మహిళల ట్రాప్ షూటింగ్, 400మీ. రిలేలో ఇవి లభించాయి. దీంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్‌కు దక్కిన బంగారు పతకాల సంఖ్య 6కు చేరింది. మంగళవారం భారత అథ్లెట్లు రెండు స్వర్ణాలు, ఒక రజతం, ఐదు కాంస్యాలతో సహా ఎనిమిది పతకాలను గెలుచుకున్నారు. దీంతో ఆసియా క్రీడల్లో భారత్‌కు దక్కిన పతకాల సంఖ్య 53కి చేరింది.

మిగతా 2లో...

## కొందరు బాగుపడితేనే అభివృద్ధి కాదు..!



**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగున ఉన్న చివరి వ్యక్తికి అందాలని, వారి ముఖంలో చిరునవ్వు కనిపించినప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌లో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

అభివృద్ధి అంటే అందరినీ ఒకే స్థాయికి తీసుకురావడం కాదని, సమాజంలోని హెచ్చుతగ్గులను, వివిధ వర్గాల మధ్య ఉన్న అంతరాన్ని వీలైనంతగా తగ్గించడమేనని ఆయన స్పష్టం చేశారు. 'కొంతమందికే గరిష్ఠ ప్రయోజనం' చేకూరాలన్న వాదనను తాను వ్యతిరేకిస్తున్నానని, దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశించినట్లుగా

మిగతా 2లో...

## పల్లెలే ప్రగతికి పునాది

- మోదీ నేతృత్వంలో గ్రామీణాభివృద్ధికి భారీ నిధులు
- పల్లె పండుగ-3.0తో మౌలిక వసతులకు ఊతం
- సీసీ, బీటీ రోడ్లు.. తాగునీరు.. పారిశుధ్యానికి ప్రాధాన్యం
- గ్రామాలు బలోపేతమైతేనే దేశం బలోపేతం: పీవీఎన్ మాధవ్



**ఉదయగిరి (జర్నలిస్ట్ ఫైల్):** పల్లెల అభివృద్ధితోనే దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఉదయగిరిలో జరిగిన పల్లె పండుగ-3.0 కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర లక్ష్యాల వైపు రాష్ట్రం సాగుతోందని తెలిపారు.

మిగతా 2లో...

## 'కల్కి భగవాన్' కన్నుమూత



**వరదయ్యపాలెం(జర్నలిస్ట్ ఫైల్) :** ఆధ్యాత్మిక గురువు విజయ్ కుమార్ నాయుడు అలియాస్ కల్కి భగవాన్ (77) చెన్నయ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. యాత్రికుల దర్శనార్థం భౌతిక దేహాన్ని వరదయ్యపాలెం మండలంలోని బత్తలవల్లం ప్రాంతంలోని ఏకం క్షేత్రంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఉంచనున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.

## రెండేళ్లలోనే పదింతల రోడ్ల నిర్మాణం

- 100 రెట్లు ఎక్కువగా మినీ గోకులాలు
- ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 6,500 కి.మీ. సీసీ రోడ్ల నిర్మాణం
- అడవి తల్లిబాటలో 1,500 కి.మీ.కు పైగా రహదారుల నిర్మాణం
- గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ 3.0
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి పనులు ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**ఉదయగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** 'పల్లెల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాది. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడేలా, ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా సమగ్ర అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రహదారులు, తాగు నీరు, వ్యవసాయం, ఉపాధి, పరిశుభ్రత, మౌలిక వసతులతోపాటు పర్యాటక రంగానికీ ప్రాధాన్యం ఇస్తూ గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చే లక్ష్యంతో 'పల్లె పండుగ 3.0'కు శ్రీకారం చుట్టామ'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు.

మిగతా 3లో...

## ఏపీ విద్యా వ్యవస్థలో సంస్కరణలు భేష్



(మొదటి పేజీ తరువాయి)

విద్యాశాఖలో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులను మంత్రి లోకేష్, సింగపూర్ హోంమంత్రికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరును, విద్యా రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను షణ్ముగం అభినందించారు. సింగపూర్ అవలంభిస్తున్న అత్యుత్తమ విధానాలను ఏపీలో అమలుకు సహకరిస్తామని షణ్ముగం హామీ ఇచ్చారు.

**డ్రాపౌట్ల తగ్గింపుపై ప్రత్యేక దృష్టి :** బడి మానేసే (స్కూల్ డ్రాపౌట్) పిల్లలే భవిష్యత్తులో మాదకద్రవ్యాల (డ్రగ్స్) బారిన పడటం, అనేక సామాజిక సమస్యలకు దారితీయడం జరుగుతుందని షణ్ముగం పేర్కొన్నారు. ఏపీలో పాఠశాలల్లో డ్రాపౌట్ రేటు తగ్గించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అభినందిస్తూనే, డ్రాపౌట్లు సున్నా శాతానికి చేరేలా మరిన్ని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఏపీ విద్యా వ్యవస్థకు సింగపూర్ సహకారం :** రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గుచూపేలా చేపట్టిన చర్యలను మంత్రి లోకేష్ వివరించారు. దీనిపై స్పందించిన సింగపూర్ హోంమంత్రి, ఏపీలోని ప్రభుత్వ పాఠశాలలను స్వయంగా సందర్శించేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. విద్య వ్యవస్థకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

**డ్రగ్స్ నియంత్రణకు సింగపూర్ మోడల్ :** సమాజానికి విపత్తుగా మారిన మాదకద్రవ్యాల నిర్మూలనకు అత్యంత కఠినమైన శిక్షలు, చట్టాలు ఉండాలని సింగపూర్ హోం మంత్రి షణ్ముగం అభిప్రాయపడ్డారు. సింగపూర్‌లో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో అవలంబించిన విధానాలను వివరించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం సింగపూర్ మోడల్ అనుసరించాలని తాము సహకరిస్తామని హోం మంత్రి తెలిపారు.

**ఏపీ ఐటీఐలకు సింగపూర్ ఐటిఈతో అనుసంధానం :** సాంకేతిక విద్యను ఆధునిక కాల అవసరాలకు అనుగుణంగా మార్చడంలో సింగపూర్‌లోని 'ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్' సాధించిన విజయాలను షణ్ముగం వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఐటీఐ లను సింగపూర్ ఐటీఈతో అనుసంధానించడం ద్వారా యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ అందించేందుకు ఇరు దేశాలు పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించాయి.

## కొందరు బాగుపడితేనే అభివృద్ధి కాదు..!

(మొదటి పేజీ తరువాయి)

'అందరికీ మేలు' జరగాలని భగవత్ ఆకాంక్షించారు. ఏ నిర్ణయం తీసుకున్నా సమాజంలోని అత్యంత నిరుపేద వ్యక్తి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్న మహాత్మా గాంధీ సూత్రాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

ప్రతి వ్యక్తికి కూడు, గుడ్డ, నీడ వంటి ప్రాథమిక అవసరాలతో పాటు నాణ్యమైన విద్య, వైద్యం అందించి, వారు గౌరవప్రదంగా జీవించేలా చూడటమే నిజమైన అభివృద్ధి అని ఆయన వివరించారు. రైతులు రుణాల ఊబిలో కూరుకుపోకుండా సేంద్రియ, మిశ్రమ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని, విత్తనాలు, ఎరువుల విషయంలో స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. ప్రగతి పేరిట ప్రకృతిని విధ్వంసం చేయకూడదని హితవు పలికారు. అభివృద్ధి బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదని, సమాజం కూడా తన వంతు పాత్ర పోషించాలని మోహన్ భగవత్ పిలుపునిచ్చారు.

## అథ్లెటిక్స్‌లో భారత్‌కు తొలి స్వర్ణం




(మొదటి పేజీ తరువాయి)

ఇందులో 6 స్వర్ణాలు, 21 రజతాలు, 26 కాంస్య పతకాలు ఉన్నాయి. షూటర్ నీరూ ధండా మహిళల ట్రాప్ ఈవెంట్‌లో స్వర్ణ కైవసం చేసుకోవడానికి ముందు ఆషిమా అహ్లావత్, మనీషా కీర్‌లతో కలిసి మహిళల ట్రాప్ టీమ్ పోటీలో రజతం సాధించింది. ట్రాక్‌పై మహిళల 4ఇ400 మీటర్ల రిలే జట్టు అద్భుత ప్రదర్శన చేసి దేశానికి రెండో స్వర్ణాన్ని అందించింది. దీంతో ఈ క్రీడల్లో భారత్‌కు దక్కిన పతకాల సంఖ్య 50కి చేరింది. అలాగే మిక్స్‌డ్ 4ఇ100 మీటర్ల రిలే జట్టు కాంస్యం, పురుషుల 5వేల మీటర్ల పరుగులో గుల్వీర్ సింగ్ కాంస్యం సాధించగా, మహిళల హైజంప్‌లో పూజా సింగ్ కాంస్యం కైవసం చేసుకుంది. ఇదే ఈవెంట్‌లో పురుషుల 4ఇ400 మీటర్ల రిలే జట్టు మరో కాంస్యాన్ని జోడించగా, పురుషుల కేజీల విభాగంలో బాక్సర్ నరేందర్ బెర్వాల్ కాంస్యం సాధించారు.

మంగళవారం జరిగిన ట్రాప్ షూటింగ్ ఫైనల్లో మొత్తం 30 షాట్లలో 28 లక్ష్యాలను ఛేదించి అగ్రస్థానంలో నిలిచింది. చైనాకు చెందిన సన్ యునాంగ్ 26/30 స్కోరుతో రజతం సాధించగా.. కువైట్‌కు చెందిన హజర్ అబ్దుల్మాలిక్ 21/25తో కాంస్య పతకం దక్కించుకుంది. ఇక పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు ఈసారి నిరాశ తప్పలేదు. శపథ్ భరద్వాజ్, కైనన్ చెనై, అహ్వార్ రిజ్వీ కలిసి 339 పాయింట్లు సాధించడంతో భారత్ ఆరో స్థానంలో నిలిచింది. కువైట్ (స్వర్ణం–355), కతార్ (రజతం–349), కజకిస్థాన్ (కాంస్యం–348) సాధించాయి.

మహిళల 4ఇ400 మీటర్ల రిలే ఫైనల్లో భారత బృందం అదరగొట్టింది కిరణ్ పహల్, మచెట్టిర పూవమ్మ, ప్రాచీ, విద్య రామ్‌రాజ్‌లతో కూడిన భారత బృందం ఫైనల్లో 3 నిమిషాల 29.69 సెకన్ల వ్యవధిలో గమ్యానికి చేరి దిప్రథమస్థానంలో నిలిచారు. బహ్రెయిన్ అథ్లెట్లు 3:30.21, చైనా బృందం 3:31.02 సెకన్ల వ్యవధిలో పరుగు పూర్తి చేసి రజత, కాంస్య పతకాలు అందుకున్నారు. ఫైనల్ రేస్ ఆరంభం నుంచి భారత్‌కు గట్టి పోటీ ఎదురైంది. ముఖ్యంగా చివరి దశలో బహ్రెయిన్ రన్నర్ సల్వా ఈద్ నాసర్ వేగంగా దూసుకు రావడంతో విత్య రామ్‌రాజ్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. అయితే ఆమె ఏమాత్రం తడబడకుండా వేగాన్ని కొనసాగిస్తూ భారత జట్టును ముందంజలో నిలిపింది. దీంతో బహ్రెయిన్ కంటే భారత్ 0.52 సెకన్ల ముందుగా గమ్యాన్ని పూర్తిచేసింది.

5వేల మీ. రిలే పరుగులో గుల్వీర్ సింగ్ కాంస్య పతకంతో మెరిసాడు. ఇప్పటికే రెండు విభాగాల్లో పోడియంపై నిలుస్తున్న ఈ మారథాన్ రన్నర్.. హ్యాట్రిక్ మెడల్ సాధించాడు. మంగళవారం జరిగిన పురుషుల 5000మీ ఫైనల్లో గుల్వీర్ 13 నిమిషాల 32.75 సెకన్లలో గమ్యానికి చేరి కాంస్య పతకం సాధించాడు. తద్వారా అథ్లెటిక్స్ దిగ్గజం పీటీ ఉష అనంతరం ఒకే ఎడిషన్‌లో మూడు మెడల్స్ పట్టేసిన భారత రెండో అథ్లెట్‌గా గుల్వీర్ చరిత్ర సృష్టించాడు. ఈ క్రీడల్లోనే గుల్వీర్ 1,500మీ, 10వేల మీటర్లలో రజత పతకాలతో మురిశాడు. బహ్రెయిన్‌కు చెందిన బిర్హాను బాలే (13:30.79 సెకన్లు) స్వర్ణం గెలుచుకోగా, జపాన్ అథ్లెట్ యమాగుచి టొమొనొరి (13:31.43 సెకన్లు) రజతం అందుకున్నాడు.

# పెత్తందార్లం కాదు... ప్రజలకు సేవకులం

(మొదటి పేజీ తరువాయి)

రీతిలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని సీఎం వెల్లడించారు. ప్రజల కళ్లకు కనబడేలా అభివృద్ధి చేస్తున్నామని... గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసే అంశంపై దృష్టి పెట్టామన్నారు. గోకులం షెడ్లు, మ్యాజిక్ డ్రైన్లను నిర్మిస్తున్నామని... ప్రతి ఒక్కరికీ ఇల్లు.. ఇంటి స్థలం, విద్యుత్, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్రకు గ్రామాలే నాందీ పలకాలని సూచించారు. చెత్త నుంచి సంపద సృష్టించే వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామని... పేదరికం లేని గ్రామాలను తీర్చిదిద్దేందుకు.. ఆర్థిక అసమానతలు తగ్గేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.



**పల్లె వికాసంలో పవన్ చొరవ అభినందనీయం:** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఇప్పటికే మూడు పల్లె పండుగ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. ఉద్యమ స్ఫూర్తితో పవన్ కళ్యాణ్ గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారని, పల్లె వికాసంలో ఆయన తనదైన ముద్ర వేశారని చంద్రబాబు అభినందించారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా పవన్ అనేక మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 13,326 గ్రామాల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని సీఎం తెలిపారు. రెండున్నర దశాబ్దాల తర్వాత పంచాయతీరాజ్ వ్యవస్థలోని వివిధ హోదాల్లో ఉన్న 10 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించామని, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 4,136 కోట్లు విడుదల చేశామని చెప్పారు. లక్షకు పైగా పంటకుంటలు తవ్వించడంతో పాటు పశువుల కోసం నీటి తొట్టెలు నిర్మించామని వివరించారు. పవన్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం అభినందనీయమన్నారు. 2024 ఎన్నికల్లో కూటమిగా ఏర్పడిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి తాను, పవన్ కళ్యాణ్ ప్రజలకు వద్దకు వచ్చి రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. నాడు హామీ ఇచ్చిన విధంగానే రాష్ట్రాన్ని నడిపిస్తున్నామన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వేసిన ఓటు వృథా కాలేదని, ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని ముఖ్యమంత్రి అన్నారు. చెప్పిన విధంగానే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రెండేళ్లలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని, జెట్‌స్పీడ్‌తో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. సంక్షేమం–అభివృద్ధి–సుపరిపాలనే ఎన్డీఏ ప్రభుత్వ మంత్రమని పేర్కొన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, సామాజిక పింఛన్లు, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను అమలు చేస్తున్నామని సీఎం వివరించారు. పేదలకు రూ. 5కే అన్నం అందించే కార్యక్రమాన్ని గత ప్రభుత్వం నిలిపివేసిందని, తాము తిరిగి అమలు చేస్తున్నామని చెప్పారు. మత్స్యకారులు, నేతన్నలు, ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని, ఆమూల్ బ్రాండ్ స్థాయిలో స్వయం బ్రాండ్‌ను అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. 30 ఏళ్ల క్రితం తానే శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టును తానే ప్రారంభించానని చెప్పారు. వెలిగొండ ఫేజ్–2 పనులను కూడా పూర్తి చేసి.. ఉదయగిరి నియోజకవర్గాన్ని.. మార్కాపురం జిల్లాను సస్య శ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. హంద్రీ–నీవా ద్వారా రాయలసీమ చివరి భూములకు నీరందిస్తున్నామని, పోలవరం ఎడమ కాల్వ ద్వారా అనకాపల్లి ప్రాంతానికి నీటిని తీసుకెళ్తున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య, ఉద్యాన పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు.

**మరింత సంక్షేమం... మరింత అభివృద్ధి:** విశాఖలో 28 వేల మందికి పైగా కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందించామని, విజయవాడలో మరో 24 వేల మందికి పట్టాలు అందించనున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. త్వరలో మూడు లక్షల ఇళ్లకు శంకుస్థాపన చేయనున్నామని చెప్పారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే పొట్టి శ్రీరాములు జలధార పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో జల్ జీవన్ పనులను భారీ ఎత్తున ప్రారంభించబోతున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఉద్యోగాలు కల్పించేలా వివిధ రంగాల్లో పరిశ్రమలను తీసుకొస్తూ ఏపీని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. కృష్ణపట్నం–రామాయపట్నం పోర్టుల మధ్య దగదర్తి విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే రైల్–రోడ్ కనెక్టివిటిని పెంచి నెల్లూరు–ప్రకాశం జిల్లాలను లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారు. బీపీసీఎల్ ప్లాంట్ ద్వారా రూ. లక్ష కోట్ల పెట్టుబడులు రానున్నాయని, డిఫెన్స్ పరిశ్రమలు కూడా ఈ ప్రాంతానికి వస్తున్నాయని చెప్పారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన నెల్లూరు, ఉదయగిరి ప్రాంతవాసులు తిరిగి ఇక్కడి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమస్యలను పరిష్కరించే బాధ్యత తమదని, అభివృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవాల్సిన బాధ్యత ప్రజలదని అన్నారు. తమ అభివృద్ధిని చూసి సహకరించాలని, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే బాధ్యత ప్రభుత్వానిదైతే.. ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రజలదని సీఎం చెప్పారు.

**ఉదయగిరి సభలో ముఖ్యమంత్రి కీలక ప్రకటనలు...:**

పల్లె పండుగ–3.0 కార్యక్రమం సందర్భంగా జరిగిన సభలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు కొన్ని కీలక ప్రకటనలు చేశారు. పెద్దిరెడ్డిపల్లె రిజర్వాయర్ కాల్వ పనులకు రూ. 52 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్–1 నిర్మాణానికి అవసరమైన రూ. 85 కోట్లు అందిస్తామని తెలిపారు. డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌కు అవసరమైన క్లియరెన్సులు మంజూరు చేస్తామని, సీబీజీ ప్లాంట్‌కు నిరంతర విద్యుత్ సరఫరాకు సహకరిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. సోమశిల డ్యామ్ భద్రతకు అవసరమైన నిధులు సమకూరుస్తామని వెల్లడించారు. క్రాకటూరు డిస్ట్రిబ్యూటరీకి నిధులను సమకూర్చడంతోపాటు... వింజమూరు ప్రాంత పరిధిలో తాగు, సాగునీటి అవసరాల కోసం రాజవోలు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. కనిగిరి ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి.. బీటీ రోడ్ల పునర్నిర్మాణానికి వీబీజీ రామ్‌జీ గ్రాంట్ అందిస్తామని చెప్పారు. కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ. 100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాళ్లపాడు రిజర్వాయర్ ద్వారా ఓలేటివారిపాలెం, గూడూరు, లింగసముద్రం మండలాల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కనిగిరి–బల్లిపల్లె వద్ద ట్రిపుల్‌ఐటీ ఏర్పాటుకు సహకరిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. అనంతరం కాకొల్లువారిపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ శ్రమదానం చేశారు. 'వీబీ జీ రాంజీ' శ్రామికుల వద్దకు వెళ్లి పొలాల మధ్య డొంక రోడ్డు పనులను ప్రారంభించారు. కాలినడకన పల్లెపండుగ అభివృద్ధి పనుల పరిశీలనించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద 'వీబీ జీ రాంజీ' శ్రామికులతో కలసి సీఎం, డిప్యూటీ సీఎం, మాధవ్ గ్రూప్ ఫొటో దిగారు.

**ఆసక్తిగా ర్యాంప్ వాక్... ఆకట్టుకున్న ఏర్పాట్లు... :** సీఎం, డిప్యూటీ సీఎంలు సభా వేదిక మీదకు రాగానే సభికుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. తమ మెళ్లో వేసుకున్న కండువాలను గాల్లో ఊపుతూ సభికులు స్వాగతం పలికారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ర్యాంప్ మీద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నడుస్తూ ప్రజలకు అభివాదం చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని చూసి పలువురు మహిళలు ఆనందంతో డ్యాన్సులు చేశారు. ర్యాంప్ వాక్ చేసిన సీఎం, డిప్యూటీ సీఎంలను ఫొటోలు తీసేందుకు పలువురు సభికులు ప్రయత్నించారు. తమ కుర్చీల్లో నుంచి లేచి ఫోన్లల్లో ఫొటోలు తీసుకున్నారు. ఇక పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో పండుగ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు చేశారు. మామిడి తోరణాలు, రంగవల్లులతో అతిథులకు, ప్రజలకు స్వాగత ఏర్పాట్లు చేశారు. సభ అనంతరం కాకొల్లువారిపాలెం గ్రామంలో పల్లెపండుగ–3.0లో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పరిశీలించారు. గ్రామస్థులు వారికి పూలు జల్లి ఘన స్వాగతం పలికారు. ప్రజలకు అభివాదం చేస్తూ అభివృద్ధి పనులను పరిశీలించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గ్రామస్థులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, ఆనం రామ్ నారాయణ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహా నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# పల్లెలే ప్రగతికి పునాది



(మొదటి పేజీ తరువాయి)

గ్రామీణాభివృద్ధి శాఖను స్వీకరించిన ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పల్లెల్లో మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

గతంలో అభివృద్ధి లోపంతో యువత, మహిళలు ఉపాధి కోసం వలస వెళ్లాల్సి వచ్చేదని గుర్తుచేశారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో గ్రామీణ సడక్ యోజన ద్వారా గ్రామాలకు రహదారి అనుసంధానం ప్రారంభమైందని, చంద్రబాబు గతంలోనే ఐటీ, వ్యవసాయం, ఉద్యానవనం, సాగునీరు, మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గ్రామీణాభివృద్ధికి వేగం పెరిగిందని, సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీ, ఎల్ఈడీ వీధి దీపాలు, గ్రామ సచివాలయాలు, వైద్య కేంద్రాలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, శ్మశాన వాటికలు, చెత్త నుంచి సంపద కేంద్రాలు వంటి సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు.

పల్లె పండుగ–3.0 ద్వారా రహదారులు, నీటి వసతులు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా శాశ్వత ఆస్తుల నిర్మాణానికీ ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణాభివృద్ధిలో రాష్ట్రానికి జాతీయ అవార్డులు రావడం పవన్ కళ్యాణ్ శాఖ పనితీరుకు నిదర్శనమన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి వ్యవసాయం, బ్యాంకింగ్, సాగునీరు, విద్య రంగాల్లో సహకార వ్యవస్థను విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పల్లెలు బలోపేతమైతేనే దేశం బలోపేతమవుతుంది; గ్రామీణాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, గ్రామీణ ప్రజలకు అభినందనలు తెలిపారు.

# పాలనలో కొత్త ఒరవడి.. నైపుణ్యాలే చోదకశక్తి

(మొదటి పేజీ తరువాయి)

పరిపాలనా నైపుణ్యాల మెరుగుదల, ప్రభుత్వ శిక్షణ సంస్థల సామర్థ్య నిర్మాణంపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చించారు. ప్రభుత్వ శిక్షణ సంస్థలు కేవలం ఉద్యోగులకు కోర్సులు నిర్వహించే కేంద్రాలుగా ఉండకూడదని సీఎం అన్నారు. సవాళ్లను పరిష్కరించడంలో ఉద్యోగుల నైపుణ్యాలను పెంచే సంస్థలుగా అవి మారాలని సూచించారు. ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా, ఆ శిక్షణ వల్ల పాలనలో ఎలాంటి మార్పు వచ్చిందో, ప్రజలకు అందే సేవల్లో ఎలాంటి మెరుగుదల కనిపించిందో కూడా కొలవాల్సిన అవసరం ఉందన్నారు. కోర్సులు పూర్తి చేసి సర్టిఫికెట్లు పొందడం మాత్రమే కెపాసిటీ బిల్డింగ్ కాదని.. నేర్చుకున్న అంశాలను ఉద్యోగులు తమ విధుల్లో ఎంతవరకు అమలు చేస్తున్నారు. ప్రజలకు అందే సేవల నాణ్యత ఎంత మెరుగుపడుతోందన్న అంశమే ప్రామాణికత అని సీఎం స్పష్టం చేశారు.

**కెపాసిటీ బిల్డింగ్ లో ఏపీకి మొదటి స్థానం :** ప్రభుత్వ ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్‌లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ రాష్ట్రంగా మొదటి స్థానాన్ని సాధించింది. ఈ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఆర్ అలపర్తి అందుకున్నారు. రెండో స్థానంలో నిలిచిన కర్ణాటక, మూడో స్థానంలో నిలిచిన ఒడిశా రాష్ట్రాలకు కూడా సీఎం అవార్డులు అందజేశారు. మిషన్ కర్మయోగి కింద ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 7.89 లక్షల మంది ఉద్యోగులు ఐగాట్‌లో నమోదు అయ్యారని సీఎం తెలిపారు. రాష్ట్రంలో రెండు కోట్లకు పైగా కోర్సులు పూర్తి చేసి దేశంలోని రాష్ట్రాల్లో ఏపీ మొదటి స్థానంలో నిలిచిందన్నారు.

రెండు కోట్ల సర్టిఫికెట్ల కంటే నేర్చుకున్న అంశాలే కీలకమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందే సేవల్లో మార్పుగా ఈ అంశాలు కనిపించాలని అని సీఎం అన్నారు. శిక్షణతో ఓ రెవెన్యూ అధికారి పౌరుడి సమస్యను వేగంగా పరిష్కరించటం, ఉపాధ్యాయుడు తరగతి గదిలో మెరుగైన బోధన అందించటం.. పోలీసు అధికారి మరింత మానవీయంగా స్పందించటం ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. పూర్తి చేసుకున్న శిక్షణతో పౌరులకు నాణ్యమైన సేవలు అందుతున్న తీరుకు కొలమానంగా ఉండాలని సూచించారు.

**టెక్నాలజీ మారింది.. పాలనా విధానాలు మారాలి :** భారత్‌లో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్నా, కొన్ని చోట్ల పాత నిబంధనలు, విధానాలు కొనసాగుతున్నాయని సీఎం అన్నారు. కంప్యూటర్లు వచ్చినా అనవసరమైన పేపర్‌వర్క్ కొనసాగడం, దరఖాస్తులను డిజిటల్ చేసినా అనేక అనుమతులు అవసరం కావడం, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చినా పౌరులను కార్యాలయాలకు రప్పించడం వంటి విధానాలను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. పాత విధానాన్ని డిజిటలైజ్ చేయడం మాత్రమే ఆధునిక పాలన కాదని... మొత్తం ప్రక్రియను మార్పు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రగతిని నిరోధించే అనవసర నిబంధనలను సరళీకరించాల్సిన అవసరం ఉందన్నారు. జన్ విశ్వాస్ వంటి సంస్కరణలు ఈ దిశలో కీలకమని చెప్పారు. ప్రస్తుతం ఐటీ విప్లవం తర్వాత ఏఐ కాలం ప్రారంభమైందని, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ప్రభుత్వ వ్యవస్థలు కూడా మారాల్సిందేనని సీఎం అన్నారు. ఏఐను కేవలం సాంకేతిక సాధనంగా కాకుండా పాలనలో నిర్ణయాలు, సమస్యల గుర్తింపు, ఉద్యోగుల నైపుణ్యాల అంచనా, శిక్షణ అవసరాల గుర్తింపులో వినియోగించుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా పాలనా వ్యవహారాలు, పౌరసేవల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. డేటా ఆధారిత వ్యవస్థలు, ఈ–ఫైలింగ్ ద్వారా నిర్ణయాలు వేగంగా తీసుకుంటున్నామని, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లను నిరంతరం పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయి అధికారులకు అవసరమైన సూచనలు ఇస్తున్నామని వివరించారు. ఏపీ ఏఐ స్టాక్, మన మిత్ర, వాట్సాప్ గవర్నెన్స్ వంటి సాంకేతిక ఆధారిత కార్యక్రమాలను పాలనలో వినియోగిస్తున్నామని అన్నారు.




**మానవీయత ద్వారానే పాలనకు విలువ :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాలనా వ్యవహారాలను గణనీయంగా మార్చగలదని సీఎం అన్నారు. ఉద్యోగుల సామర్థ్య లోపాలను గుర్తించడం, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా శిక్షణా కోర్సులను సూచించడం, పరిపాలనా నిర్ణయాలను మెరుగుపరచడంలో ఏఐ ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, యంత్రాంగం ప్రభుత్వ పాలనలో కీలకమని సీఎం అన్నారు. వరదలు, తుపాన్ల లాంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలను ఆదుకునేందుకు ఉద్యోగులే ముందు ఉంటారని గుర్తుచేశారు. పండుగలు, ప్రభుత్వ కార్యక్రమాలు, విపత్తుల సమయంలో కుటుంబాలను సైతం పక్కనపెట్టి ప్రజా సేవలో నిమగ్నం అవుతున్న ఉద్యోగుల సేవలను ఎప్పటికీ విస్మరించలేమని సీఎం వ్యాఖ్యానించారు. మీ ముందున్న ప్రతి ఫైలు వెనుక ఒక మనిషి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు ఉంటుంది. ప్రజలకు సేవ చేసే అవకాశం ఉద్యోగులకు లభించడం గొప్ప బాధ్యత అని సీఎం అన్నారు. ఉద్యోగులు నిరంతరం తమ నైపుణ్యాలను పెంచుకునేలా ఆన్‌లైన్ శిక్షణను వినియోగించుకోవాలని సీఎం సూచించారు. సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూస్తూ గడిపే సమయాన్ని కెపాసిటీ బిల్డింగ్ కోసం వెచ్చిస్తే వ్యక్తిగత నైపుణ్యాలను పెంచుకోవచ్చని అన్నారు. ఐగాట్–మిషన్ కర్మయోగి ద్వారా ఉద్యోగులు ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకునే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు అధికారులు, ఉద్యోగులు నిరంతర శిక్షణ పొందినప్పుడే ప్రజలకు నాణ్యమైన సేవలు అందించగలమని చెప్పారు.

**శాఖల మధ్య సమాచార మార్పిడి కీలకం :** ప్రభుత్వ శాఖల మధ్య నిరంతరాయంగా సమాచార పంపిణీ జరగాలని సీఎం అన్నారు. సమాచార వ్యవస్థలు పరస్పరం అనుసంధానమై ఉంటే సమస్యలను సంక్షోభంగా మారక ముందే గుర్తించి పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. సాంకేతికత, విధానాలు, ప్రక్రియలు, ఉద్యోగుల సామర్థ్యాలను సమన్వయం చేసినప్పుడే వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవచ్చని చెప్పారు. 1978లో సంస్కరణలు ప్రారంభించిన చైనా కొన్ని దశాబ్దాల్లోనే తన సామర్థ్యాలను భారీగా పెంచుకుని ఆర్థికంగా ఉన్నతస్థాయికి చేరిందని సీఎం పేర్కొన్నారు. భారత్‌లోనూ అపారమైన అవకాశాలు, వనరులు ఉన్నాయని, ప్రపంచవ్యాప్తంగా భారతీయులు తమ నైపుణ్యాలను నిరూపించుకున్నారని అన్నారు. ఆర్థిక సంస్కరణల తర్వాత భారతీయుల ఆకాంక్షలు మారాయని, వాటికి అనుగుణంగా ప్రభుత్వ వ్యవస్థలు కూడా మారాలని సూచించారు. ప్రపంచంలోని ప్రముఖ సంస్థలకు భారతీయులు నాయకత్వం వహిస్తున్నారని, ఆ సామర్థ్యాలను దేశాభివృద్ధికి వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ శిక్షణ సంస్థలు భవిష్యత్తు సవాళ్లను ముందుగానే అంచనా వేసి ఉద్యోగులను సిద్ధం చేయాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని గుర్తించిన 61 శిక్షణ సంస్థలను ఉన్నతి కింద ఐగాట్‌లో అనుసంధానించామని తెలిపారు. అమరావతిలో గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఏర్పాటు దిశగా కూడా పనిచేస్తున్నామని చెప్పారు.

**ఏపీకి కెపాసిటీ బిల్డింగ్ పాలసీ :** ఆంధ్రప్రదేశ్ కెపాసిటీ బిల్డింగ్ పాలసీని ప్రవేశపెట్టి, రాష్ట్రంలోని 38 శాఖలకు కెపాసిటీ బిల్డింగ్ ప్రణాళికలు రూపొందించినట్లు సీఎం తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగుల సామర్థ్యాలు, నిరంతర అభ్యసనకు కెరీర్ అభివృద్ధిలో తగిన గుర్తింపు ఇవ్వాలని సూచించారు. ప్రతి ఉద్యోగికి ఎదిగే అవకాశం, ప్రతి సంస్థకు మెరుగుపడే అవకాశం, ప్రతి పౌరుడికి దాని ప్రయోజనం అందేలా వ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వం నియంత్రించే వ్యవస్థగా కాకుండా ప్రజలను సాధికారత వైపు నడిపే వ్యవస్థగా మారాలని సీఎం అన్నారు. ప్రజలకు జ్ఞానం, మౌలిక సదుపాయాలు, సాంకేతికత, అవకాశాలను అందించి వారు తమ భవిష్యత్తును తామే నిర్మించుకునేలా చేయడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి దిశగా ప్రభుత్వ యంత్రాంగం సమాయత్తం కావాలని, పీ4 వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచే అవకాశం ఉందన్నారు. మిషన్ కర్మయోగి ద్వారా ఉద్యోగులు కేవలం కోర్సులు పూర్తి చేయడం కాకుండా, నేర్చుకున్నదాన్ని విధుల్లో అమలు చేయాలని సీఎం సూచించారు. లెర్నింగ్ వర్క్‌ఫోర్స్ నుంచి లెర్నింగ్ నేషన్ గా భారత్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సీఎం పిలుపునిచ్చారు. 2047 వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలకు ప్రతీ పౌరుడి జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వ యంత్రాంగాలు కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఛైర్ పర్సన్ రాధా చౌహాన్, సభ్యురాలు అల్కా, ఆ సంస్థ కార్యదర్శి జగదీప్ గుప్తా, ఏపీ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయుష్ కుమార్, మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ కాటమనేని భాస్కర్ తదితరులు హాజరయ్యారు.

# రూ.35కే కేజీ ఉల్లిపాయలు

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో భాగంగా నేటి నుంచి రైతు బజార్ల ద్వారా కేజీ ఉల్లిపాయలను రూ. 35కే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తొలి దశలో విజయవాడ నగరంలోని అన్ని రైతు బజార్లలో సబ్సిడీ ధరకు ఉల్లిపాయల విక్రయాలను ప్రారంభిస్తున్నట్లు మంత్రులు వెల్లడించారు. ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డు ఆధారంగా ప్రతి కుటుంబానికి నెలకు 2 కేజీల చొప్పున, కేజీ రూ. 35 ధరకు ఉల్లిపాయలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల వల్ల సామాన్య ప్రజలపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు మార్కెట్ పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటోందని మంత్రులు తెలిపారు. ఉల్లిపాయల ధరల విషయంలో కూడా ప్రజలకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో సబ్సిడీ ధరకు విక్రయాలు చేపడుతున్నట్లు వివరించారు. విజయవాడలో ప్రారంభించే ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే స్పందన, డిమాండ్‌ను బట్టి తదుపరి దశలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు బజార్లకు విస్తరించి, సబ్సిడీ ధరకు ఉల్లిపాయలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రులు స్పష్టం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ కోరారు.

# తిరుమలలో మంత్రి నారా లోకేష్



- **సింగపూర్ హోంమంత్రి కే.షణ్ముగంతో కలిసి శ్రీవారిని దర్శించుకున్న మంత్రి**

**తిరుమల (జర్నలిస్ట్ ఫైల్):** విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం ఉదయం సింగపూర్ హోంమంత్రి కే. షణ్ముగంతో కలిసి కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శించుకునేందుకు సోమవారం రాత్రి తిరుమల చేరుకున్న సింగపూర్ హోంమంత్రి కే. షణ్ముగంకు మంత్రి లోకేష్ స్వాగతం పలికారు. అనంతరం ఈ ఉదయం గౌరవ మర్యాదలతో షణ్ముగంను శ్రీవారి దర్శనానికి తోడ్కొని వెళ్లారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, ఆలయ అర్చకులు వారికి ఘనస్వాగతం పలికారు. ఇరువురు కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు సోమవారం రాత్రి తిరుపతి ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్న మంత్రి లోకేష్‌కు స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనస్వాగతం పలికారు.

# వివేకా హత్య కేసులో అంతిమ లబ్ధిదారుడు జగనే



- **రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్**

**అమరావతి, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్):** వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అంతిమ లబ్ధిదారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వివేకా హత్యపై అప్పట్లో గుండెపోటుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారని, ప్రస్తుతం కూడా వైసీపీ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. వైసీపీ హయాంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సంస్కృతి పెరిగిందని, కాకుమాను రాజశేఖర్ మరణంపైనా రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. వివేకా హత్య కేసులో సీబీఐ, ఈడీ దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో పలు అంశాలు వెలుగులోకి వస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. దస్తగిరి అప్రూవర్‌గా ఇచ్చిన వాంగ్మూలం, సునీల్ యాదవ్ వెల్లడించిన అంశాలు, సుపారీ లావాదేవీలపై దర్యాప్తు వంటి విషయాలపై దర్యాప్తు సంస్థలు వాస్తవాలను తేల్చాల్సి ఉందన్నారు. స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపైనా వైసీపీ రాజకీయాలు చేస్తోందని విమర్శిస్తూ, ఉద్యోగులకు మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వివేకా హత్య కేసుపై జగన్ వాస్తవాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

# రాజ్యాంగ సంస్థల ప్రతిష్టను దెబ్బతీయడమే రాహుల్ గాంధీ లక్ష్యం

- **బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** భారత ఎన్నికల సంఘంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజల్లో అపనమ్మకం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్‌ఐఆర్‌కు సంబంధించిన కీలక నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. ఫారం-6లో ఎలాంటి మార్పులు చేయలేదని, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అదనపు డిక్లరేషన్‌ను జత చేశామని ఎన్నికల సంఘం వెల్లడించిందని యామిని శర్మ తెలిపారు. ఓటర్ల నమోదు ప్రక్రియను సులభతరం చేయడానికే ఈ విధానం తీసుకొచ్చినట్లు ఈసీ పేర్కొందన్నారు. యువ ఓటర్లను నమోదు చేయడం లేదన్న ఆరోపణలపై స్పందిస్తూ, 2025 ఎస్ఐఆర్ తర్వాత 2.73 కోట్ల మంది 18-28 ఏళ్ల యువ ఓటర్లు నమోదయ్యారని ఈసీ వెల్లడించిన విషయాన్ని ప్రస్తావించారు.

ఎన్నికల ఫలితాలపై అసంతృప్తితో ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని యామిని శర్మ అన్నారు. రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసే వ్యాఖ్యలను రాహుల్ గాంధీ నిలిపివేసి, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల గౌరవంతో వ్యవహరించాలని ఆమె కోరారు. ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు, ఆరోపణలు ఉంటే వాటిని ఆధారాలతో సంబంధిత రాజ్యాంగ సంస్థల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

# రెండేళ్లలోనే పదింతల రోడ్ల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)



పల్లె బలపడితేనే రాష్ట్ర భవిష్యత్తు బలపడుతుందనే సంకల్పంతో ప్రతి పల్లెను అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. మంగళవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరిలో పల్లెపండుగ 3.0 కార్యక్రమం ద్వారా రూ. 11,085 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలసి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పి. వి. ఎన్. మాధవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**గత ఐదేళ్ల కంటే రెండేళ్లలోనే పదింతల రోడ్ల నిర్మాణం :** ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. "ఈ రెండున్నరేళ్లలో పల్లెపండుగ, జలజీవన్ మిషన్ – అమరజీవి జలధార, 15వ ఆర్థిక సంఘం నిధుల సద్వినియోగం, 10 వేలకు పైగా పదోన్నతులు, డి. డి. ఓ. కార్యాలయాల ఏర్పాటు.. ఇలా ఎన్నో సంస్కరణలతో ఒకవైపు గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తూనే, మరోవైపు వ్యవస్థను బలోపేతం చేశాం. ఒకప్పుడు పంచాయతీలు బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేని పరిస్థితి నుంచి, ఇప్పుడు తమ గ్రామానికి అవసరమైన పనులను తామే నిర్ణయించుకుని, తమ గ్రామ అభివృద్ధికి తామే ప్రణాళికలు రూపొందించుకునే స్థాయికి పంచాయతీ రాజ్ వ్యవస్థను తీసుకొచ్చాం.

గత ప్రభుత్వం ఐదేళ్లలో 880 కి. మీ. సీసీ రోడ్లు నిర్మిస్తే, కూటమి ప్రభుత్వం ద్వారా కేవలం రెండేళ్లలోనే దానికి 10 రెట్లు ఎక్కువగా, దాదాపు 9,000 కి. మీ. సీసీ రోడ్లను పూర్తి చేశాం. గతంలో 304 మినీ గోకులాలు మాత్రమే నిర్మిస్తే, మనం దాదాపు 100 రెట్లు ఎక్కువగా, 30 వేలకు పైగా మినీ గోకులాలను నిర్మించాం.

అలాగే, పల్లెపండుగ ద్వారా 13,326 గ్రామ పంచాయతీల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాం. ఇందులో భాగంగా 1 లక్ష 15 వేల పంట కుంటలను నిర్మించడంతోపాటు, 2 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేశాం. మరోవైపు, 10 వేల కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి.

మన కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, ఇతర కాలనీల్లో 6,500 కిలోమీటర్ల సీసీ రోడ్లను ఇప్పటికే పూర్తి చేసింది. గిరిజన గ్రామాలకు రహదారి అనుసంధానాన్ని మరింత మెరుగుపరచేందుకు అడవితల్లిబాట కార్యక్రమం కింద రూ. 2,180 కోట్ల వ్యయంతో సుమారు 2,437 కిలోమీటర్ల రహదారులను నిర్మించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. ఇందులో ఇప్పటికే 1500 కిలోమీటర్లకు పైగా అనుసంధాన రహదారులను నిర్మించాం.

అలాగే, ఇప్పటివరకు రోడ్డు అనుసంధానం లేని బంజారా, యానాది, ఎరుకుల గిరిజన ఆవాసాలు ఉన్న ప్రాంతాల్లో, పల్లెపండుగ ద్వారా 167 ఆవాసాలకు 111.4 కి. మీ. మేర రహదారి సౌకర్యం కల్పించాం.

**పల్లెపండుగ 3.0తో గ్రామీణ ప్రగతికి కొత్త ఊపు :** ఈ రోజు ఇక్కడ మనం రాష్ట్ర చరిత్రలో గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ అభివృద్ధిని పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళ్లబోతున్నాం.

రూ. 50 వేల కోట్లతో పల్లెపండుగ, జల జీవన్ మిషన్ – అమరజీవి జలధార వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయబోతున్నాం. ఇందులో రూ. 30 వేల కోట్లతో అక్టోబర్ 5న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి జల జీవన్ మిషన్ – అమరజీవి జలధార కార్యక్రమం ద్వారా మల్టీ విలేజ్ స్కీమ్, సింగిల్ విలేజ్ స్కీమ్ పనులకు శంకుస్థాపనలు చేయబోతున్నాం.

అలాగే రూ. 9 వేల కోట్లతో పల్లెపండుగ 1.0, 2.0 కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసి, ఈ రోజు రూ. 11,085 కోట్లతో ప్రతిష్టాత్మకంగా పల్లెపండుగ 3.0ను ప్రారంభిస్తున్నాం. ఇందులో భాగంగా 6 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, మరో 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేయబోతున్నాం.

అలాగే, 1,000 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్లు, బస్ షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, రచ్చబండలు తదితర అభివృద్ధి పనులను చేపట్టబోతున్నాం.

**పైలెట్ ప్రాజెక్ట్‌గా డొంక రోడ్ల అభివృద్ధి :** ఎన్నో ఏళ్లుగా రైతులు తమ పంటలను మార్కెట్‌కు తరలించేందుకు డొంక రోడ్ల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ముందుగా పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రతి నియోజకవర్గంలో ఒక డొంక రోడ్డును అభివృద్ధి చేయబోతున్నాం.

ఆ తర్వాత 161 గ్రామీణ నియోజకవర్గాల్లో డొంక రోడ్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, రైతులు తమ పంటలను సులభంగా మార్కెట్‌కు తీసుకెళ్లేలా రహదారి సౌకర్యాన్ని మెరుగుపరచబోతున్నాం.

**ఉదయగిరి ఇక అభివృద్ధి బాటలో :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోనే దాదాపు రూ. 520 కోట్లతో పల్లెపండుగ పనులు చేపట్టాం. ఇంకా మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టబోతున్నాం.

మన ఉదయగిరిలోనే పల్లెపండుగ ద్వారా రూ. 121 కోట్లతో 115 కి. మీ. మేర సీసీ, బీటీ రోడ్లు, 1,200కు పైగా నీటి కుంటలు, 348 గోకులాలు, 190కి పైగా నీటి తొట్లు, సుమారు 900 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు వంటి అభివృద్ధి పనులను పూర్తి చేశాం.

ఉదయగిరి నియోజకవర్గంలోని ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా, గతంలో నిలిచిపోయిన సుజల స్రవంతి పథకం ద్వారా రూ. 52 కోట్లతో, దుత్తలూరు, జలదంకి, కలిగిరి, కొండాపురం, సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు మండలాల్లో 381 పనులు చేపట్టబోతున్నాం.

ఉదయగిరి కోటకు చేరుకునే మార్గంలో సుమారు 4 కి. మీ. రహదారిని రూ. 2.5 కోట్లతో మంజూరు చేస్తున్నాం. దీనికి అవసరమైన అటవీ శాఖ అనుమతులను త్వరగా పొందేలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశిస్తున్నాను.

ఉదయగిరి కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ ద్వారా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసి, స్వదేశీ దర్శన్, సాస్కీ పథకాల ద్వారా అవసరమైన నిధులు సమకూర్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అలాగే, ఉదయగిరి కొండను హెరిటేజ్ టూరిజం ప్రాంతంగా, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

ఉదయగిరిలో ఇప్పటికే క్రాఫ్ట్ ఉడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి, వేప, బిక్కి, కల్దీ, పాలబర్క్ వంటి చెక్కలను అందుబాటులోకి తీసుకొచ్చాం. చెక్క స్పూన్లు, గిన్నెలు, చెక్కబొమ్మల తయారీలో ప్రసిద్ధి చెందిన స్థానిక కళాకారులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే, వారు తమ ఉత్పత్తులను తయారు చేసుకునేందుకు అనుగుణంగా సొసైటీ భవనాల మరమ్మతు పనులు చేపడుతున్నాం. త్వరలో శాశ్వత భవనాలను కూడా నిర్మించబోతున్నాం.

ఒకప్పుడు గజ్జలవారిపల్లి పాఠశాల విద్యార్థులు సోషల్ మీడియా ద్వారా రహదారి కోసం చేసిన విజ్ఞప్తి నా దృష్టికి రాగానే, వెంటనే స్పందించి ఆ రహదారి పనులను కూడా పూర్తి చేశాం.

అలాగే కావలి నియోజకవర్గంలోని గోగులపల్లి గ్రామ పంచాయతీ ఉప్పు సత్యాగ్రహం సమయంలో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్న ప్రాంతం. అక్కడి ప్రజలు తమ ఉప్పు ఉత్పత్తులను రవాణా చేసుకునేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని నా దృష్టికి తీసుకొచ్చారు. వారి విజ్ఞప్తి మేరకు సుమారు 1.9 కి. మీ. రహదారిని రూ. 3.5 కోట్లతో నిర్మించేందుకు త్వరలో పనులు ప్రారంభిస్తాం.

ఈ పనులను ప్రాధాన్యతా ప్రాతిపదికన చేపట్టేలా పంచాయతీరాజ్ అధికారులకు, జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు ఇస్తున్నాను.

**ప్రజల భాగస్వామ్యంతో ప్రగతి సాధ్యం :** అభివృద్ధి పనుల్లో ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా చాలా ముఖ్యం. మన గ్రామంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనిని ప్రజలు తమ పనిగా భావించి, దాని పురోగతిని గమనించాలి.

కాంట్రాక్టర్ పనులు నాణ్యతగా చేస్తున్నారా? నిబంధనల ప్రకారం పనులు జరుగుతున్నాయా? అనే విషయాలను ప్రజలు పరిశీలించాలి. ఎక్కడైనా అనుమానం వచ్చినా, నాణ్యతలో లోపం కనిపించినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అవసరమైతే సోషల్ ఆడిట్ ద్వారా పనుల వివరాలను, ఖర్చులను, నాణ్యతను ప్రజల ముందే పరిశీలించవచ్చు.

ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతుంది. ఆ పనులు సక్రమంగా, నాణ్యతగా జరిగేలా చూడటం, ప్రశ్నించడం, పర్యవేక్షించడం ప్రభుత్వం తో పాటు ప్రజల బాధ్యత కూడా. ప్రజలు భాగస్వాములై అభివృద్ధి పనులను పర్యవేక్షించినప్పుడే మన గ్రామాల అభివృద్ధి మరింత పారదర్శకంగా, నాణ్యతగా ముందుకు సాగుతుంది.

ఈ రోజు ఉదయగిరి నుంచి మొదలైన ఈ ప్రయాణం, రేపటి ఆంధ్రప్రదేశ్‌కు కొత్త మార్గాన్ని చూపాలి.. ఇక్కడ మొదలైన ఈ పల్లెపండుగ 3.0... అభివృద్ధి పట్ల మనందరి భాగస్వామ్యానికి ఒక కొత్త ఆరంభం కావాలి అని అన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ, ఎన్. ఎం. డి. ఫరూక్, నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, బి. సి. జనార్ధన్ రెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాజ్య సభ సభ్యులు బీద మస్తాన్ రావు, ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, కూటమి పార్టీలకు చెందిన శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, వివిధ కార్పోరేషన్ల ఛైర్మన్లు పాల్గొన్నారు.

# నరసింగపల్లికి విద్యుత్ వెలుగులు.. రూ.3.92 కోట్లతో సబ్‌స్టేషన్‌కు శ్రీకారం



**కోటబొమ్మాళి (జర్నలిస్ట్ ఫైల్):** గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసి నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోటబొమ్మాళి మండలం వాంగ్రాడ పంచాయతీ పరిధిలోని నరసింగపల్లిలో రూ. 3.92 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. సబ్‌స్టేషన్‌తో పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మెరుగుపడటంతో పాటు వోల్టేజీ సమస్యలు తగ్గుతాయని చెప్పారు. గత 24 నెలల్లో విద్యుత్ ఛార్జీలు పెంచలేదని, ప్రజలపై రూ. 20 వేల కోట్ల విద్యుత్ భారం తగ్గించినట్లు తెలిపారు.

ప్రజలు సౌర విద్యుత్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అచ్చెన్నాయుడు సూచించారు. నిమ్మడలో త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి స్థానిక యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ప్రతి చెరువుకూ పైప్‌లైన్ల ద్వారా సాగునీరు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, టెక్కలి నియోజకవర్గంలోని 367 గ్రామాలకు తాగునీరు అందించేందుకు రూ. 624 కోట్ల ప్రాజెక్టు మంజూరైందని పేర్కొన్నారు. గ్రామాల్లో రహదారులు, విద్యుత్, తాగునీరు, సాగునీటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

# క్యూ ఆర్ కోడ్ పై అవగాహన



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** పౌర సరఫరాల శాఖ పంపిణీ చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ (పి. డి. ఎస్) లో క్యూ ఆర్ కోడ్ కీలక పాత్ర వహిస్తుందని జిల్లా పౌర సరఫరాల అధికారి పి. కోమలి పద్మ అన్నారు. క్యూ ఆర్ కోడ్ అమలు, తదితర అంశాలను ప్రత్తిపాడు ఎం. ఎల్. ఎస్ పాయింట్ తో పాటు పలు చౌక ధరల దుకాణాలలో డి. ఎస్. ఓ మంగళవారం పరిశీలించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో నాలుగు మండలాల డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీలర్లకు క్యూ ఆర్ కోడ్ విధానంపై అవగాహన కలిగించారు. పి. డి. ఎస్ మరింత పారదర్శకంగా పని చేయుటకు నూతనంగా ప్రవేశపెట్టిన క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ విధానంలో డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను నివృతి చేశారు. చౌక ధరల దుకాణాలలో పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సి. ఎస్ డి. టి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో రూ.11,498 కోట్లతో 'డబుల్ డెక్కర్' మెట్రో



**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** విశాఖపట్నంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా మరో కీలక అడుగు పడింది. మోదీ ప్రభుత్వ పూర్తి మద్దతుతో విశాఖలో వినూత్నమైన 'డబుల్ డెక్కర్ మెట్రో' ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. ఈ భారీ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ బీజేపీ శాఖ ఎక్స్ వేదికగా వెల్లడించింది.

**ఒకే పిల్లర్‌పై ఫ్లైఓవర్, మెట్రో :** ఈ ప్రాజెక్టును అధునాతన సాంకేతికతతో నిర్మించనున్నారు. భూసేకరణ, స్థల సమస్యలను అధిగమించేలా ఒకే పిల్లర్‌పై కింద ఫ్లైఓవర్, దానిపై భాగంలో మెట్రో రైలు వెళ్లేలా డబుల్ డెక్కర్ వ్యవస్థను రూపొందిస్తున్నారు. ఒకే పిల్లర్‌పై ఈ రెండు మార్గాలను తీసుకురావడం ద్వారా వైజాగ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సరికొత్త బాటలు వేస్తోందని ఏపీ బీజేపీ తన 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది.

**తొలి దశకు రూ. 11,498 కోట్లు :** విశాఖ డబుల్ డెక్కర్ మెట్రో తొలి దశ (ఫేజ్ వన్) పనుల కోసం ముమ్మరంగా ప్రణాళికలు సిద్ధమయ్యాని బీజేపీ తెలిపింది. ఈ ఫేజ్ వన్ ప్రాజెక్టును ఏకంగా రూ. 11,498 కోట్ల అంచనా వ్యయంతో వేగంగా ముందుకు తీసుకువెళ్లేలా కేంద్రం నుంచి ఆమోదం లభించిందని రాష్ట్ర బీజేపీ వివరించింది. ఈ వినూత్న ప్రాజెక్టు పట్టాలెక్కితే ప్రయాణికులకు మెరుగైన రవాణా సదుపాయం లభించడంతో పాటు విశాఖ నగర రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని పేర్కొంది.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సమక్షంలో చేరికలు




**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో హైకోర్టు అడ్వకేట్ సి. రాధాకృష్ణ భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి. వి. ఎన్. మాధవ్ రాధాకృష్ణను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి, కమలం కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. బిజెపి క్షేత్ర స్థాయిలో నిర్వహించే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని మాధవ్ కోరారు. పార్టీ లో చేరడం తో పాటు గా ఇచ్చి న భాధ్యతలు తీసుకుని పార్టీ అభివృద్ధికి పని చేయాలన్నారు.

పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాల పట్ల ఆకర్షితులై బీజేపీలో చేరిన రాధాకృష్ణకు ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీ రాం తదితరులు అభినందనలు తెలిపారు.

# వీవీఐటీలో ఇష్రే విద్యార్థి విభాగం ప్రారంభం

- **నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక అనుభవానికి ప్రాధాన్యం**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ (వీవీఐటీ)లో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ హీటింగ్, రెఫ్రిజిరేటింగ్ అండ్ ఎయిర్ కండిషనింగ్ ఇంజినీర్స్ (ఇష్రే) విద్యార్థి విభాగాన్ని ప్రారంభించినట్లు వీవీఐటీ ప్రో-ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు పారిశ్రామిక రంగంపై అవగాహన కల్పించేందుకు వీవీఐటీ, ఇష్రే చాప్టర్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరిందని చెప్పారు.

ఈ ఒప్పందంపై ఇష్రే చాప్టర్ అధ్యక్షురాలు డాక్టర్ అనూష, వీవీఐటీ రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా విద్యార్థులకు ఇష్రే స్టూడెంట్ సర్టిఫికెట్ కోర్సులు అందించడంతో పాటు హీటింగ్, వెంటిలేటింగ్, ఎయిర్ కండిషనింగ్ రంగాల్లో పారిశ్రామిక సందర్శనలు, సాంకేతిక సదస్సులు, నిపుణులతో వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు క్షేత్రస్థాయి అనుభవం కల్పించేందుకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు.

కార్యక్రమంలో వీవీఐటీ రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె. గిరిబాబు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి. శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంజిఎం హాస్పిటల్ అధ్వాన్న పరిస్థితి పై ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం

◆ వినతిపత్రం అందజేసిన
డ్యాగల శ్రీనివాస్, పద్మ మహిపాల్



నర్సంపేట సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా వరంగల్ జిల్లా, హన్మకొండ జిల్లా డెమోక్రటిక్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్జీవో) ఆధ్వర్యంలో జాతీయ చైర్మన్ అయిలినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వరంగల్ లోని మహాత్మాగాంధీ మెమోరియల్ హాస్పిటల్ (ఎంజిఎంహెచ్) ఆసుపత్రి లో ఎటువంటి సౌకర్యాలు లేక అల్లాడుతున్న రోగుల పరిస్థితి గురించి అడిషనల్ కలెక్టర్ కు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ మరియు వరంగల్ జిల్లా చైర్మన్ డ్యాగల శ్రీనివాస్, హన్మకొండ జిల్లా చైర్మన్ పద్మ మహిపాల్ లు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ లోని మహాత్మ గాంధీ మెమోరియల్ ఆసుపత్రి (ఎంజిఎంహెచ్) ఒకప్పుడు నాలుగు ఉమ్మడి జిల్లాలకు పెద్దాస్పత్రిగా పేరుగాంచిన ఎంజిఎం గత రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో వస్తున్న భాధిత రోగులకు ఎటువంటి సౌకర్యాలు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఈ మధ్య కాలంలో హాస్పిటల్ లోని ఆరోగ్యశ్రీ వార్డులో పై కప్పు పెచ్చులు ఊడి పడడంతో అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు తీవ్ర గాయాలు కావడం జరిగిందని అన్నారు.

హాస్పిటల్ ఆవరణలో అపరిశుభ్ర వాతావరణము అలాగే సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ఎయిర్ కండిషన్లు సరిగా పనిచేయకపోవడం, లిఫ్టులు మొరాయించడంతో పేద ప్రజలకు చికిత్స నిమిత్తం చాలా ఇబ్బందులతో ప్రమాదకరంగా ఉన్న పరిస్థితులను మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డి హెచ్ ఆర్ సి (ఎన్జిఓ) ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ వరంగల్ జిల్లా చైర్మన్ డ్యాగల శ్రీనివాస్, హన్మకొండ జిల్లా చైర్మన్ పద్మ మహిపాల్, హన్మకొండ జిల్లా మహిళా చైర్మన్ తులసి కళ్యాణి, జిల్లా మహిళా కో కన్వీనర్ బైరి రాధిక, హన్మకొండ కమిటీ సభ్యులు బి. లక్ష్మణ్, నర్సంపేట టౌన్ వైస్ చైర్మన్ నూనె రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలి
ఆహారం, పారిశుధ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి
ఫుడ్ పాయిజనింగ్, ఎలుకలు, పాముకాటు ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు
శీతాకాలం దృష్ట్యా వెచ్చని నీరు, దుప్పట్లు ముందుగానే అందుబాటులో ఉంచాలి
దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా చర్యలు
రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



నర్సంపేట సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలోని పాఠశాల విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను పటిష్టంగా పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ నుడి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యతో పాటు మౌలిక వసతులపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థలను క్రమం తప్పకుండా ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నప్పటికీ కొన్ని చోట్ల ఫుడ్ పాయిజనింగ్, ఎలుకలు, పాముకాటు వంటి ఘటనలు చోటు చేసుకోవడం పై ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని సీఎస్ ప్రస్తావించారు.
ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఆహారం తయారీ, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించాలని సీఎస్ తెలిపారు.
విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, పారిశుధ్య నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల లోపాలు తదితర అంశాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.
సాధ్యమైన చోట్ల వంటశాలల ఆధునీకరణ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని సూచించారు.రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఉన్నతస్థాయిలో పర్యవేక్షించేందుకు రూపొందించిన డ్యాష్‌బోర్డ్‌ను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించాలని సంజయ్ జాజు తెలిపారు.
విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయా లేదా, ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను పరిశీలించి, వాటి వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అన్నారు.క్షేత్రస్థాయిలో చేపట్టిన మార్పులు, సమస్యల పరిష్కార చర్యలను కూడా పోర్టల్‌లో నిరంతరం అప్‌డేట్ చేయాలని సూచించారు.జిల్లాలో రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సంబంధించి ఏదైనా ప్రతికూల నివేదిక వచ్చినప్పుడు సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సీఎస్ సూచించారు. ప్రభుత్వం డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి అమలు చేస్తోందని, కాస్మెటిక్ ఛార్జీలను ప్రస్తుతం డీబీటీ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు.రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు స్నానానికి వెచ్చని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన దుప్పట్లను ముందుగానే సమకూర్చాలని సీఎస్ ఆదేశించారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థల భవన యజమానులతో కలెక్టర్లు సమావేశమై అవసరమైన మార్పులు, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి ఉపాధ్యాయుడికి అవసరమైన శిక్షణ అందేలా చర్యలు చేపట్టాలని సీఎస్ తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతిరోజూ ఒక లక్ష యూనిఫారాలు కుట్టేలా చర్యలు చేపట్టాలని, దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.యూనిఫాం క్లాత్ ఇప్పటికే జిల్లాలకు చేరినందున కుట్టు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలు, సమస్యల పరిష్కార వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో క్రమం తప్పకుండా నవీకరించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లను ఆదేశించారు.వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.అదేవిధంగా ఆర్‌సీవోలు, సంబంధిత జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి, విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యా ప్రమాణాలు, భద్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.విద్యార్థుల నుంచి వచ్చే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా స్పందనాత్మక వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రతి ఫిర్యాదుపై నిబంధనల ప్రకారం పరిశీలన అనంతరం తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ, వైవి గణేష్, జిల్లా బి సి వెల్ఫేర్ అధికారి పుష్పలత, డి టి డి వో నారాయణరెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి రంగయ్య నాయుడు, సంబధిత ఆర్సీవోలు , తదితరులు పాల్గొన్నారు.

## మిర్చి రైతుల సమస్యలపై స్పందించిన జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు



ఏటూరునాగారం, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : ములుగు జిల్లా ఏటూరునాగారం మండలానికి చెందిన మిర్చి రైతులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను సోమవారం ములుగు జిల్లా "ఆత్మ" కమిటీ చైర్మన్ చిటమట రఘు దృష్టికి తీసుకువచ్చారు.రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్న చిటమట రఘు వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మిర్చి రైతులు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవి పేటలోగార్మి షరీఫ్ జెండా పండుగ

- సుల్తానా బేగం సర్వర్ అహ్మద్ ఆధ్వర్యంలో
సాంప్రదాయ బద్దంగా పూజలు- హాజరైన ముస్లిం సోదరులు



ములుగు, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవి పేట గ్రామంలో గార్మి షరీఫ్ జెండా పండుగ ఘనంగా నిర్వహించారు. లక్ష్మీదేవి పేట గ్రామం చెందిన మదిన మసీద్ వ్యవస్థాపక అధ్యక్షులు మీద ఆధ్వర్యంలో ఆదివారం జెండాను ఆవిష్కరించారు. ముస్లిం కుల సాంప్రదాయపద్దంగా ప్రత్యేక పూజలు చేసి జెండాను ఎగరవేశారు. ముస్లిం మత గురువు యాకు పాషా, ఫాతియా ప్రార్థన చేసి, అందరికీ మంచి జరగాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత గురువు ఎంఏ రజాక్, బషీరుద్దీన్, గౌస్ పాషా యాకూబ్ పాషా, ఆసిఫ్, జీప్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ షకీల్ పాషా, రెహనా, నర్సింగాపూర్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సుమన్, పీఆర్టీయు రాష్ట్ర నాయకులు పెండ్యాల సలేంద్రం, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కొండపర్తి సదానందం,సీనియర్ జర్నలిస్ట్ నల్లబెల్లి సాంబయ్య పటేల్, జనుకో కార్మిక సంఘం జిల్లా నాయకులు అల్లం ఓదెల్ రౌత్ రాజు, ఎలక్ట్రిషన్ బస్వోజ్ క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏళ్లనాటి హద్దురాయి ఆధారంగా భూ రీ సర్వే



నల్లబెల్లి సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : భూరీ సర్వేను 70 ఏళ్లనాటి హద్దురాయి ఆధారంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని తహసి ల్దార్ ముప్పు కృష్ణ సూచించారు. నల్లబెల్లి మండలం అర్షన పల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వే కార్యక్రమంలో భాగంగా 70 ఏళ్లనాటి హద్దురాయి దొరకడంతో రెవిన్యూ అధికారులు ఊపిరి పిలుచుకున్నారు. మొదటిగా గ్రామానికి సంబంధించిన హద్దులను నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో రెవిన్యూ సిబ్బంది. జి పి ఓ లు. మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

## అరుట్ల మైనారిటీల సమస్యల పరిష్కారానికి మంత్రి అజారుద్దీన్ హామీ

- స్మశానవాటికకు భూమి, షాదీఖానా నిర్మాణం సహా పలు సమస్యలపై అధికారులతో చర్చిస్తానని వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లా మంచాల మండలం అరుట్ల గ్రామ మైనారిటీల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలు, నిర్దేశిత విధానాలు, అందుబాటులో ఉన్న వనరుల మేరకు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని తన ఛాంబర్‌లో అరుట్ల గ్రామానికి చెందిన మైనారిటీ ప్రతినిధుల బృందం మంత్రి అజారుద్దీన్‌ను కలిసి గ్రామంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది. ముఖ్యంగా ముస్లిం స్మశానవాటిక కోసం భూమి కొనుగోలుకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని, గ్రామంలో ముస్లిం షాదీఖానా నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరింది. వీటితో పాటు గ్రామంలోని మౌలిక వసతులు, సామాజిక అవసరాలకు సంబంధించిన పలు సమస్యలను కూడా ప్రతినిధులు వివరించారు. ప్రతినిధుల వినతులపై సానుకూలంగా స్పందించిన మంత్రి అజారుద్దీన్.. సంబంధిత అధికారులతో సమస్యలపై చర్చించి, నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రతి అంశాన్ని పరిశీలించి సాధ్యమైన పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అరుట్ల గ్రామ యువత విద్య, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. విద్యార్థులు, యువత ఉన్నత విద్యను అభ్యసించేలా, నైపుణ్యాలను పెంపొందించుకునేలా ప్రోత్సహించాలని ప్రతినిధులను కోరారు. సమాజ అభివృద్ధి, ఆర్థిక పురోగతిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.
కాగా, ఈ నెల ప్రారంభంలోనే మంత్రి అజారుద్దీన్ అరుట్ల గ్రామాన్ని సందర్శించి స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ పరిస్థితులను స్వయంగా పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మంత్రి గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు కొన్ని సమస్యల పరిష్కారానికి ఇప్పటికే చర్యలు ప్రారంభమయ్యాయని మైనారిటీ ప్రతినిధులు మంత్రికి తెలిపారు. తమ సమస్యలను ఓపికగా విని, సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన మంత్రి అజారుద్దీన్‌కు ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి స్వయంగా గ్రామాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకోవడం స్థానిక ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందని వారు పేర్కొన్నారు.

## ములుగు మండల మహిళా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షుల ఎన్నిక

- ములుగు మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా పిట్టల రాధిక..
- ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా అల్లూరి సంధ్య...



ఏటూరునాగారం, సెప్టెంబరు 29(జర్నలిస్ట్ ఫైల్) : జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచన మేరకు ములుగు జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మద్దాలి నాగమణి ఆధ్వర్యంలో ములుగు మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా ములుగు పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు పిట్టల రాధిక,ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా అల్లూరి సంధ్య గారిని నియమిస్తూ ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి చేతుల మీదుగా వారికి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా నూతనంగా మండల అధ్యక్షురాలిగా నియమితులైన పిట్టల రాధిక ప్రత్యేక కి శుభాకాంక్షలు తెలిపి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని,మండలంలోని మహిళా నాయకులందరితో మమేకమై కాంగ్రెస్ పార్టీ విజయాలకు కృషి చేయాలని అన్నారు.నూతనంగా మండల అధ్యక్షురాలిగా నియమితులైన పిట్టల రాధిక ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్లు నల్లెల్ల స్వాతి భరత్ కుమార్, అలోత్ పద్మ దేవ్ సింగ్,ఎండీ కుతుబుద్దిన్, రవాణా శాఖ స్టేట్ డైరెక్టర్ వసంత శ్రీనివాస్,జిల్లా ప్రచార కార్యదర్శి నూనెటి శ్యామ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ అలోత్ దేవ్ సింగ్, పస్ర సర్పంచ్ సుమలత,గోవిందరావుపేట మండల మహిళా అధ్యక్షురాలు వసంత, తాడ్వాయి మండల మహిళా అధ్యక్షురాలు సరిత, నాయకులు నెల్లుట్ల రాజన్న,ప్రభు, గూడెపు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.




## కేంద్ర ఎన్నికల సంఘం అక్రమాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

- పాల్గొన్న రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క!



ఏటూరునాగారం, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో ఎన్నికల సంఘం అక్రమాలకు వ్యతిరేకంగా ములుగు జిల్లా కట్టశీద్రంలో సోమవారం నిర్వహించిన ర్యాలీలో రాష్ట్ర మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క పాల్గొని ఓటు చోరీ అక్రమాలకు పాల్పడిన సిఇసి జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్రం పభుత్వానికి బీజేపీ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ములుగు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందించారు.మంత్రి సీతక్క వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి,గుమ్మడి సోమయ్య,ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్,డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న,మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మద్దాలి నాగమణి,జిల్లా సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు,అన్ని మండలాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు,యూత్ నాయకులు మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంగపేట మండలం అభివృద్ధి కోసం రూ. కోటి 1. 76 లక్షల కేటాయించిన రాష్ట్ర మంత్రి సీతక్క

- కమలాపురం గ్రామ అభివృద్ధి కోసం రూ.41.96817 రూపాయలు
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గాజర్ల రాజు



ఏటూర్‌నాగారం, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీల అభివృద్ధి కోసం గ్రామాలను మండలాలను అభివృద్ధి పదంలో నడిపిస్తున్న రాష్ట్ర మంత్రి గ్రామీణ అభివృద్ధి శాఖ మాత్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క నిరుపేద కుటుంబంలో నుండి పుట్టి అనేకమైన ఉద్యమాలలో తిరిగి ప్రజల యొక్క కష్టాలు సుఖాలు వారి బాధలను అర్థం చేసుకొని గ్రామాలను మండలాలను అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర మంత్రి సీతక్క తెలంగాణ రాష్ట్రంలో ఏ పల్లె చూసినా ఏ మండలం చూసినా అభివృద్ధి పదంలో ఉంటుందని మంగపేట మండల ఎస్సీ సెల్ మాజీ ప్రధాన కార్యదర్శి గాజర్ల రాజు అన్నారు. ములుగు జిల్లాలో తన నియోజకవర్గమైన ములుగు అభివృద్ధిలో ముందుండి అభివృద్ధి చెందుతున్న ములుగు జిల్లా ప్రతి మండలంలో ప్రతి గ్రామపంచాయతీలలో ఏ వీధి చూసిన ఏ వాడ చూసినా సీతక్క ఆధ్వర్యంలో సిసి రోడ్లు ఏసి ప్రజల యొక్క మన్నన పొందుతున్న రాష్ట్ర మంత్రి సీతక్క మంగపేట మండలంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు రాష్ట్ర పంచాయతీ యొక్క అభివృద్ధి నిధులతో మంగపేట మండలం అభివృద్ధి చెందుతుందని గాజర్ల రాజు అన్నారు. కమలాపురంలో 41,96 817 లక్షల రూపాయలతో కమలాపురాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుంది. ములుగు జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్చుకోలేక పోతున్నారు టీఆర్ఎస్ పార్టీ నాయకత్వం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు అనేకమైన అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వం లో జరుగుతుందని వారు అన్నారు ములుగు నియోజకవర్గని రాష్ట్ర మంత్రి సీతక్క ఇంకా అభివృద్ధి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి గాజర్ల రాజు అన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



నర్సంపేట, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 220 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో రెవెన్యూ శాఖకు 56, జీడబ్ల్యూఎంసీకి 74, హౌసింగ్ శాఖకు 16, డీఆర్డీవో 15 రాగా ఇతర శాఖలకు సంబంధించిన 59 దరఖాస్తులు వచ్చాయి.అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్ చేసి, సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ప్రజావాణిలో రెవెన్యూ, హౌసింగ్, జీడబ్ల్యూఎంసీ,డిఆర్డిఓ శాఖల పరిధిలో అధికంగా దరఖాస్తు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణి దరఖాస్తులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్ కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జడ్పీ సీఈవో వసంత, డీఎంహెచ్‌వో డా. రాజి రెడ్డి,కలెక్టరేట్ సూపరిడెంట్ విశ్వప్రసాద్ తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గురుకులాల సమస్యలు పరిష్కరించాలి



నర్సంపేట, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏబీఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, స్వేరోస్ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు బొట్ల నరేష్, శని గరపు రాజేంద్రప్రసాద్, ఒంటరి చక్రి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అందించే నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు తనిఖీ చేసిన సమయంలోనే పరిసరాలు శుభ్రంగా ఉంచుతున్నారని, ఆ తర్వాత సమస్యలు పునరావృతమవుతున్నాయని తెలిపారు. ఎంజేపీ, గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన బియ్యం అందించాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదులు ఏర్పాటు చేయాలని కోరారు.

## గోదావరి వరద ఉధృతి - ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు



ఏటూరునాగారం, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) : ములుగు జిల్లాలో నాలుగు రోజుల పాటుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎగువ ప్రాంతంలో నుంచి గోదావరి వరద ఉధృతి పెరుగు తుండటంతో ఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు బిఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం ఓడగూడం వద్ద గోదావరి వరద నీటి ప్రవాహాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటిమట్టం 14.18 మీటర్లకు చేరుకుందని, త్వరలోనే మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి (14.83 మీ)కి చేరుకునే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ, పోలీస్, నీటిపారుదల శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి, ముంపు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. ప్రజలు, రైతులు నదివైపు వెళ్లకుండా, పిల్లలు మరియు పశువుల పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తుమ్మ మల్లారెడ్డి, కూనూరు అశోక్ గౌడ్, తాడూరి రఘు, కక్ర రవీందర్, ఉపసర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, కొండాయి చిన్ని, కార్యదర్శి జనార్ధన్, యాదగిరి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## చంద్రుపట్ల అంగన్వాడి కేంద్రంలో పోషకార మహోత్సవాలు నిర్వహణ

**కల్లూరు, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) :**





చంద్రుపట్ల సెక్టార్ పరిధిలోని యజ్ఞ నారాయణపురం పంచాయతీ పరిధి లో ఉన్న అంగన్వాడి కేంద్రాలలో ఘనంగా పోషకాహార మాసోత్సవాలు సోమవారం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుజాత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని అంగనవాడికి క్రమం తప్పకుండా రావాలని తెలిపారు. బాల్యవివాహాలు గ్రామంలో ఉండకూడదని ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచనలు చేశారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉపసర్పంచ్ రావి సూర్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో అందించే ఆరోగ్య లక్ష్మి, భోజనము ప్రతి ఒక్క పేద బిడ్డకు అందాలని ప్రభుత్వం సూచించిందని తెలిపారు .అదే విధంగా అంగన్వాడీలు ద్వారా అందించే పౌష్టికాహారం లబ్దిదారులకు చేరువయ్యేలా చూసే బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో సామూహిక సీమంతాల వేడుకలు జరిపి రక్తహీనత నివారణకు తగు చర్యలు తీసుకోవాలని అందరూ కూడా ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వ లక్ష్యం ఒక్కటేనని అందరూ కూడా ఆరోగ్యంగా ఉండాలని. ప్రీస్కూలు కు చిన్నారులను పంపాలని. నాన్యమైన విద్య అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ సుజాత అంగన్వాడీ టీచర్లు కరుణ నిర్మల జ్యోతి ఆశ ఆయాలు తల్లులు పిల్లలు గ్రామ దీపికలు తదితరులు పాల్గొన్నారు.

## యువత గుండెల్లో రగిలిన భగత్ సింగ్ విప్లవ జ్వాల

- **సిరికొండ లో CPI(ML) మాస్ లైన్ ఆధ్వర్యంలో 119వ జయంతి వేడుకలు**
- **భగత్ సింగ్ త్యాగం, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు పోరాడాలి.ఈ దేశంలో ఫాసిజనీ తరిమికొట్టాలి**

**దర్పల్లి, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) :**



ఇంక్విలాబ్ జిందాబాద్" అనే నినాదం నేటికీ యువతలో స్ఫూర్తిని నింపుతూనే ఉందని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ సిరికొండ ధర్పల్లి సంయుక్త మండల కార్యదర్శి★ ఆర్ రమేష్ పిలుపును ఇచ్చారు★ అన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి, దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన అమర వీరుడు సర్దార్ భగత్ సింగ్ ఆశయాలు నేటి యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు.భగత్ సింగ్ 117వ జయంతి సందర్భంగా సిరికొండ మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ సిరికొండ ధర్పల్లి సంయుక్త మండల కమిటీ★ ఆధ్వర్యంలో సోమవారం నాడు ఘనంగా వేడుకలు నిర్వహించారు. తొలుత భగత్ సింగ్ చిత్రపటానికి పీడీఎస్‌యూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థుల నినాదాలతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది.ఈ కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ★ భగత్ సింగ్ కేవలం ఒక స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదని, యువతలో విప్లవ చైతన్యాన్ని రగిలించిన స్ఫూర్తిదాయక వ్యక్తి అని అన్నారు. బ్రిటీష్ పాలనలోని అణచివేతకు వ్యతిరేకంగా చిన్న వయసులోనే ఉద్యమ బాట పట్టి, దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని గుర్తుచేశారు. ఉరి త్రాడును ముద్దాడిన యువకిషోరం అన్నారు.కేంద్ర శాసనసభలో భగత్ సింగ్ బాంబు విసిరిన ఘటనను ప్రస్తావిస్తూ.. అది ప్రాణనష్టం కలిగించాలనే ఉద్దేశంతో కాకుండా, బ్రిటీష్ ప్రభుత్వానికి నిరసన స్వరం వినిపించాలనే ఉద్దేశంతో జరిగిన చర్యగా వక్తలు వివరించారు. ఈ కళాశాల ఉపాధ్యాయురాలు ప్రవళిక ప్రసంగించగా, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ నాయకులు ఆర్ దామోదర్, మండల నాయకులు ఎస్ కిశోర్, ఎస్ కె సాధుల్లా, ఆర్ సిద్ధు, కళాశాల ఉపాధ్యాయురాలు ప్రవళిక కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య, ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి.

- **పాఠశాల, ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు.**

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) :**





చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాత కొత్తగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)ను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో బోధన, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల అభ్యసన స్థాయితో పాటు ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు, ల్యాబొరేటరీ సేవలను పరిశీలించారు.ముందుగా చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలపై వారి అవగాహనను తెలుసుకున్నారు. పదో తరగతి తరగతి గదిలో ఉపాధ్యాయుడు అందుబాటులో లేకపోవడంపై ఆరా తీసిన ఆయన, సరైన సమాధానం లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పదో తరగతి ఫలితాలు, విద్యార్థుల ప్రస్తుత విద్యా ప్రగతిపై వివరాలు తెలుసుకుని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.అనంతరం పాత కొత్తగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్, రోజువారీ ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ సుమారు 50 నుంచి 60 మంది వరకు ఓపీకి వస్తున్నట్లు అధికారులు తెలిపారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇన్‌పేషెంట్ విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్ రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, మందుల పంపిణీపై ఆరా తీశారు. అనంతరం స్టోర్ రూమ్‌లో మందుల నిల్వలను తనిఖీ చేశారు. మందుల గడువు తేదీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, గడువు ముగిసిన మందులను నిబంధనల ప్రకారం తొలగించాలని ఆదేశించారు. అవసరమైన మందులు, వైద్య పరికరాల కోసం ముందస్తుగా ఇండెంట్ పెట్టి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించిన కలెక్టర్, ప్రతి ఒక్కరూ విధులకు సక్రమంగా హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ల్యాబొరేటరీని పరిశీలించిన ఆయన రక్త పరీక్షలు, డెంగ్యూ, మలేరియా నిర్ధారణ పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. మలేరియా కిట్లు అందుబాటులో ఉన్నాయని, డెంగ్యూ కిట్ల కోసం ఇప్పటికే ఇండెంట్ పెట్టినట్లు సిబ్బంది తెలిపారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అవసరమైన పరీక్షా కిట్లు, మందులను ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు.పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో తహసీల్దార్ నాగరాజు, ఎంఈఓ నీరజ, పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి, నర్సులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.కావాలంటే దీనిని ఇంకా కుదించి, దినపత్రికలో ప్రచురించే 250–300 పదాల వార్తా రూపంలో కూడా తయారు చేయవచ్చు.

## అనాథ వృద్ధుడికి అండగా కడాలి నాగరాజు.





**భద్రాచలం, సెప్టెంబరు29(జర్నలిస్ట్ ఫైల్):** రెండేళ్లుగా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రోడ్డుపక్కన దీనస్థితిలో జీవిస్తున్న ఓ అనాథ వృద్ధుడికి సామాజిక సేవకుడు కడాలి నాగరాజు అండగా నిలిచారు.భద్రాచలం కొత్త మార్కెట్ సమీపంలో సుమారు 70 ఏళ్ల వయస్సున్న పెరుమాళ్ల కృష్ణ గత రెండేళ్లుగా ఎలాంటి ఆదరణకు నోచుకోకుండా నిరాశ్రయుడిగా జీవిస్తున్న విషయం నాగరాజు దృష్టికి వచ్చింది. వృద్ధుడి పరిస్థితిని చూసి చలించిన ఆయన మానవతా దృక్పథంతో స్పందించారు.ఈ మేరకు సోమవారం పెరుమాళ్ల కృష్ణను సరోజినీ వృద్ధాశ్రమంలో చేర్పించి, ఆయనకు సురక్షితమైన ఆశ్రయం కల్పించారు. ఇంతకాలం రోడ్డు పక్కనే ఎండ, వానను ఎదుర్కొంటూ జీవించిన వృద్ధుడికి ఇప్పుడు వృద్ధాశ్రమంలో సురక్షితమైన నీడ లభించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.ఆపదలో ఉన్న నిరాశ్రయులకు అండగా నిలిచి, వారికి అవసరమైన సహాయం అందించడం ద్వారా కడాలి నాగరాజు మానవత్వాన్ని చాటుకున్నారని స్థానికులు అభినందించారు.

## దేవరయాంజాల్‌లో ఘనంగా హనుమాన్ యూత్ అసోసియేషన్ వినాయక శోభాయాత్ర

**శామీర్‌పేట, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) :**



శామీర్‌పేట డివిజన్ పరిధిలోని దేవరయాంజాల్‌లో శ్రీ హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించిన 14 రోజుల వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.వినాయక లడ్డూ వేలం పాటలో రూ.4.60 లక్షలకు బాబాగూడకు చెందిన సింగిరెడ్డి దీపక్‌రెడ్డి, సింగిరెడ్డి సాయికిరణ్‌రెడ్డి, సింగిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిలు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్‌రెడ్డితో కలిసి లడ్డూను విజేతలకు అందజేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్నారై కుక్కునూరు వినోద్‌కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. భక్తుల కోసం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాలకు సహకరించిన దాతలను శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం డప్పుల మోతలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ భారీ వినాయక శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా శోభాయాత్ర కొనసాగగా భక్తులు పెద్దఎత్తున పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, యువత, భక్తులు, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన శ్రీ హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులను, మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

## పాఠశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం: ప్రతిజ్ఞ చేసిన విద్యార్థులు



**నిజామాబాద్ రూరల్, సిరికొండ, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) :** మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల మరియు కళాశాలలో 'నషా ముక్త భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం పాఠశాల ప్రార్థనా సమయంలో విద్యార్థులందరితో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని నషా ముక్త భారత్ ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం తెలంగాణ చౌరస్తా లో మానవహారం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాకేష్ రెడ్డి మాట్లాడుతూ... మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు హితవు పలికారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, అవి విద్యార్థుల భవిష్యత్తును, విద్యా ప్రగతిని దెబ్బతీస్తాయని హెచ్చరించారు. దురలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్య మంత్రి పర్యటన ఏర్పాట్లు చేయాలి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ పనులకు అక్టోబర్ 4వ తేదీన శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్ర శేఖర్ పాల్గొననున్నారని చెప్పారు. హెలిపాడ్ ఏర్పాట్లు, రహదారి మరమ్మతులు, వేదిక నిర్మాణం తదితర అంశాలను పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ ఆర్.శ్రీనివాస మూర్తి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జె.వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, తహసిల్దార్ గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జాషువా జయంతి సందర్భంగా మాచర్ల బుజ్జికి సాహితీ పురస్కారం



నరసరావుపేట, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్): మహాకవి గుర్రం జాషువా 131వ జయంతి సందర్భంగా నరసరావుపేటలోని మహాత్మ జ్యోతిబాపూలే కళ్యాణమండపంలో ఉషోదయ ఫౌండేషన్, తెలుగు కళా రత్నాలు ఫౌండేషన్, తిరుపతి సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ వైద్యమిత్ర రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జికి జాషువా సాహితీ ప్రతిభా పురస్కారం అందజేశారు. వైద్యరంగంలో అందించిన సేవలను గుర్తించి సంస్థల అధ్యక్షుడు యు.వి. రత్నం, కార్యదర్శి ఉషారాణి చేతుల మీదుగా పురస్కారం అందించారు.

పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందని మాచర్ల బుజ్జి తెలిపారు. ఈ గుర్తింపు మరింత సేవ చేయడానికి ప్రోత్సాహాన్ని ఇస్తుందని, భవిష్యత్తులో పేద ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కవి మంద వెంకట్రావు, కలరామ్, హైకోర్టు న్యాయవాది వంకాయలపాటి రవి, పల్నాడు జిల్లా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు సిహెచ్. నాగరాజుతో పాటు కవులు, కళాకారులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

## స్వర్ణ గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల సస్పెన్షన్లు ఉపసంహరించాలి



○ మున్సిపల్ కమిషనర్‌కు వినతి

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): స్వర్ణ గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులపై విధించిన సస్పెన్షన్లను వెంటనే ఉపసంహరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాష గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. సెప్టెంబరు 28న కమిషనర్‌ను కలిసి ఉద్యోగుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

స్వర్ణ గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కె. అబ్దుల్ రజాక్‌ను సెప్టెంబరు 26న సస్పెండ్ చేయడం సరికాదని చాంద్ బాష పేర్కొన్నారు. సస్పెన్షన్‌ను వెంటనే ఉపసంహరించి అబ్దుల్ రజాక్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ సమస్యను పరిశీలిస్తామని తెలిపినట్లు ఉద్యోగ సంఘం నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీజీఈఎస్ఏ గుంటూరు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మణిశ్రీ, నగర శాఖ సహాయ అధ్యక్షుడు అబ్దుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు డి. రాజు, అన్వర్, గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి హిదయతుల్లా, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పనుల్లో జాప్యం చేస్తే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టండి

○ డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి
○ అన్ని ప్రాంతాలలో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
○ క్షేత్రస్థాయిలో పర్యటించే సమస్యలు తెలుసుకుంటున్నాం
○ గత వైసీపీలో నియోజకవర్గ అభివృద్ధి పదేళ్లు వెనక్కి
○ వివిధ ప్రాంతాల్లో పర్యటించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో, ప్రతి గడపలో సమస్యలను తెలుసుకునేందుకు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ క్షేత్రస్థాయిలో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం మద్దిరాలకాలనీ, మంగళదాస్ నగర్, రాజగోపాల్ నగర్, బసవతారకనగర్, గడ్డిపాడు ప్రాంతాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో ప్రజలతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మద్దిరాల కాలనీలో రోడ్ల నిర్మాణంలో అలసత్వంపై అధికారులను ప్రశ్నించారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్దిష్ట సమయంలోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల్లో జాప్యం జరిగితే మాత్రం సంబంధిత కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. వర్షాకాలం కావడంతో డ్రెయిన్ల నిర్మాణంలో వేగవంతంగా పనులు చేపట్టాలన్నారు. దీనిపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని మున్సిపల్ అధికారులకు చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొందించి నిధులు రాబట్టగలుగుతున్నామని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్లు, డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో నియోజకవర్గాన్ని పదేళ్లు అభివృద్ధిలో వెనక్కి తీసుకెళ్లారని, కనీసం ప్రధాన రోడ్లలోనూ తట్టమట్టి వేసిన దాఖలాలు లేవని విమర్శించారు.

## నగర పాలక సంస్థ షాపులకు వారం రోజుల్లో వేలం

○ రెవెన్యూ సేవల్లో జాప్యంపై చర్యలు తప్పవన్న కమిషనర్ మయూర్ అశోక్



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): నగర పాలక సంస్థకు చెందిన ఖాళీగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లలోని షాపులకు వారం రోజుల్లోగా వేలం నిర్వహించి కేటాయింపులు పూర్తి చేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఐల వారీగా రెవెన్యూ, వీఎల్‌టీ వసూళ్లను సమీక్షించి, తక్కువ వసూళ్లు ఉన్న అధికారులు కలెక్షన్లు పెంచాలని సూచించారు.

మ్యుటేషన్, కొత్త పన్ను విధింపు, వీఎల్‌టీ తదితర ప్రజా సేవల అభ్యర్థనలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. సేవలలో జాప్యం చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వీస్ రిక్వెస్ట్‌ల పెండింగ్, ఎస్-ఎల్ఏ దాటిన కేసులు, విధుల్లో నిర్లక్ష్యంపై వార్డ్ సచివాలయం-3 బిల్ కలెక్టర్ పద్మావతి, వార్డ్ సచివాలయం-17 రెవెన్యూ కార్యదర్శి సుందర్ సింగ్‌లను సస్పెండ్ చేసి, చార్జ్‌షీట్ నమోదు చేసి విచారణ చేపట్టాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు.

నగర పాలక సంస్థ షాపుల బకాయిలను వంద శాతం వసూలు చేయాలని, లీజు గడువు ముగిసిన షాపులకు వారం రోజుల్లో వేలం నిర్వహించాలని ఆదేశించారు. వేలం నిర్వహణలో జాప్యం జరిగితే రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల ఫిర్యాదులను నిర్దేశిత గడువులో పరిష్కరించాలని, కారణం లేకుండా సేవలు లేదా ఫిర్యాదులను తిరస్కరిస్తే సంబంధిత ఆర్ఐలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలోని నిబంధనల ప్రకారం పన్ను విధించాల్సిన అపార్ట్‌మెంట్లు, లేఅవుట్లకు పన్నులు విధించి, ఎలాంటి తప్పులు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఐ. కిషోర్, డిప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, సి. హెచ్. శ్రీనివాస్, జి. సాంబశివరావు, సూపరింటెండెంట్ రవికిరణ్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ లో సత్తా చాటిన ఆవుల శిరీష

○ ఘనంగా సత్కరించిన ప్రిన్సిపాల్ ముండ్లపాటి చంద్రశేఖర్



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):మంగళగిరి ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026లో కడప జిల్లా ప్రొద్దుటూరు కి చెందిన ఆవుల చిన్న నాగముని ఆవుల వరలక్ష్మి దంపతుల ద్వితీయ కుమార్తె ఆవుల శిరీష రాయలసీమ జెన్ స్టార్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి జట్టులో ఆల్‌రౌండర్ ప్రతిభ కనబరిచి అద్భుతమైన ప్రతిభ కనబరిచి అటు బ్యాటింగ్ విభాగంలోనూ ఆడిన రెండు మ్యాచుల్లో 90 స్ట్రైక్ రేట్ తో ఇటు బౌలింగ్ లోను అద్భుతమైన ప్రదర్శన కనబరిచి చివరి ఫైనల్ మ్యాచ్లో బౌలింగ్ చేసి మొదటి నాలుగు వికెట్లను తీసి కేవలం 19 పరుగులు మాత్రమే ఇచ్చి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును గెలుచుకోవడమే కాకుండా రాయలసీమ జెన్ స్టార్ జట్టు విజయానికి కీలక పాత్రను పోషించిన శిరీష కు అభినందన వెల్లువ లభించింది టోర్నమెంట్ ముగించుకొని తిరిగి తన స్వగ్రామమైన ప్రొద్దుటూరుకు వచ్చిన ఆమెకు తమ బంధువులు సన్నిహితులు సోదరులు సాటి క్రీడాకారులు ఆమె ఇంటికి చేరుకొని ఆమెకు కాలువ గజమాలతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా ఆమె సన్నిహితులు మాట్లాడుతూ శిరీష గత పది సంవత్సరాల నుండి క్రికెట్లో అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తుందని ఆమె రానున్న రోజుల్లో భారత జట్టుకు ఎంపిక కావడం మా ఆకాంక్షను వారు తెలియజేశారు అనంతరం ఆంధ్రప్రదేశ్ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ విజేత ఆవుల శిరీష మాట్లాడుతూ నా పైన ఇంతటి అభిమానం చూపించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని నేను విజయం సాధించడం వెనక నా జుట్టు సభ్యులు కోచ్ అలాగే ఫ్రాంచైజర్ల సహకారం నాకు లభించిందని అందుకే మా జట్టు విజయం సాధించడంలో నేను కీలకమైన వికెట్లను పడగొట్టగలిగానని రానున్న రోజుల్లో మరింత కష్టపడి భారత జట్టుకు ఎంపిక కావడమే నా లక్ష్యమని ఆమె తెలియజేసింది ఈ కార్యక్రమంలో ఆమె కుటుంబ సభ్యులు ఆవుల నాగసుధ ముండ్లపాటి భాస్కర్ ఆవుల గణేష్ సూర్యనారాయణ ముండ్లపాటి చంద్రశేఖర్ కవిత మునీశ్వర్ సుధీర్ పలువురు క్రీడాకారులు సన్నిహితులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు

○ పటిష్ట బందోబస్తు మధ్య ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహణ



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు జిల్లా వ్యాప్తంగా స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలను పోలీసులు పటిష్ట బందోబస్తు మధ్య ప్రశాంతంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని పాఠశాలల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. నగరంపాలెం, వెనిగండ్ల, గోగులమూడి, కాకుమాను, మందడం గ్రామాల్లో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల సమయంలో సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాఠశాలల వద్ద నిరంతరం బందోబస్తు నిర్వహిస్తూ పరిస్థితులను పర్యవేక్షించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు.

## జిల్లా వ్యాప్తంగా పోలీసుల విస్తృత అవగాహన కార్యక్రమాలు

○ మాదకద్రవ్యాల నివారణ, మహిళలు-బాలల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం, నేరాల నివారణ, మహిళలు-బాలల భద్రత, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై పోలీసులు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు పాఠశాలలు, కళాశాలలు, ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సంబంధిత అంశాలపై బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు.

రాబోయే ఎన్నికల నేపథ్యంలో మేడికొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని డోకిపర్రు, తురకపాలెం, కాకుమాను పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో పోలీసులు పర్యటించి ప్రజలతో మాట్లాడుతున్నారు. ఎలాంటి గొడవలు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కల్పిస్తూ, వాటి అక్రమ వినియోగం లేదా విక్రయాల సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరుతున్నారు. విద్యార్థులు చెడు సావాసాలకు దూరంగా ఉండాలని, పిల్లల ప్రవర్తనలో మార్పులను తల్లిదండ్రులు గమనించాలని సూచిస్తున్నారు.

పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, వెనిగండ్ల గ్రామం, తెనాలి వన్‌టౌన్ పరిధిలోని నాజర్‌పేటలో మహిళలు, విద్యార్థులకు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులకు అభయ ఆటో యాప్ వినియోగంపై వివరించారు.

సైబర్ నేరాల విషయంలో తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, అనుమానాస్పద కాల్స్, సందేశాలు, ఈ-మెయిల్స్‌కు స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, బ్యాంకు సమాచారం ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పోక్సో చట్టం, మహిళలు-బాలల రక్షణ, రోడ్డు భద్రత తదితర అంశాలపైనా అవగాహన కల్పిస్తున్నారు. ప్రజల భాగస్వామ్యంతో నేరాల నివారణ, యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచడం, నేర రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ నుంచి మినహాయింపు ఇచ్చి, గతంలో అమలులో ఉన్న రిఫరల్ ఆసుపత్రుల విధానంలో క్యాష్‌లెస్ వైద్యాన్ని పునరుద్ధరించాలని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈహెచ్ఎస్ ద్వారా వైద్య సేవలు పొందడంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరింది.

మంగళగిరిలో జరిగిన ఈహెచ్ఎస్ జాయింట్ కమిటీ సమావేశంలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య తెలిపారు. పెండింగ్ మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను మంజూరు చేయడంతో పాటు, రిటైర్డ్ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర సమయంలో ఎంపానెల్డ్ ఆసుపత్రుల్లో క్యాష్‌లెస్ వైద్యం నిరాకరించకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సీఈఓకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

## ఆల్ ఇండియా సైనిక్ శిక్షణ శిబిరానికి ఎస్ఆర్ఎం విద్యార్థి



అమరావతి, సెప్టెంబరు 29(జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన విద్యార్థి ఆల్ ఇండియా స్థాయి సైనిక్ శిక్షణ శిబిరానికి ఎంపికై ప్రతిభ చాటారు. యూనివర్సిటీలో సెకండ్ ఇయర్ బీఎస్సీ చదువుతున్న విద్యార్థి నిఖిల్ ఈ అరుదైన అవకాశం దక్కించుకున్నారు.

ఢిల్లీలోని ఎన్సీసీ డైరెక్టర్ జనరల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఆల్ ఇండియా సైనిక్ శిక్షణ శిబిరానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎన్సీసీ డైరెక్టరేట్ పరిధి నుంచి మొత్తం 52 మంది ఎన్సీసీ కేడెట్లు ఎంపికయ్యారు. వీరిలో హెల్త్ అండ్ హైజీన్ విభాగంలో ఎంపికైన ఏకైక విద్యార్థి నిఖిల్ కావడం విశేషం. అంతేకాకుండా, ఎన్సీసీ గుంటూరు రీజియన్ నుంచి ఈ శిబిరానికి ఎంపికైన ఏకైక కేడెట్‌గా కూడా నిఖిల్ నిలిచారు. ఆల్ ఇండియా స్థాయి శిక్షణ శిబిరంలో పాల్గొని శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని యూనివర్సిటీకి తిరిగి వచ్చిన నిఖిల్‌ను యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ కల్లూరి అభినందించారు.

ఈ సందర్భంగా నిఖిల్‌ను వీసీ, రిజిస్ట్రార్‌తో పాటు డైరెక్టర్ మేజర్ గురుప్రీత్ సింగ్, ఎన్సీసీ ఆఫీసర్ హరి నారాయణ అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పిల్లల తల్లిదండ్రులు లేకుండానే ఎన్నికల నిర్వహణ?



○ అక్రమ దారులకు అండగా నిలిచిన విద్యాశాఖ

బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్ ):రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నాడు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికల ప్రక్రియ కడప జిల్లా బ్రహ్మంగారిమఠం గోవిందమాంబ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు లేకుండానే ఎన్నికలు నిర్వహించి చైర్మన్ వైస్ చైర్మన్ పదవులని ఎన్నుకొని విజయం సాధించినట్లు అధికారులు ప్రకటించడం తీవ్ర చర్చనీయాంశానికి దారితీసింది రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ లలో బ్రహ్మంగారిమఠం గోవిందమాంబ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఎన్నికలు మంగళవారం జరుగుతున్నట్లు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కేవలం చైర్మన్ కావాలనుకున్న వ్యక్తులకు సంబంధించిన వారికి మాత్రమే సమాచారం ఇచ్చి మిగిలిన విద్యార్థులతో అలాగే హాస్టల్ లో ఉన్న విద్యార్థులతో వారి సంరక్షకురాలు అయినా వార్డెన్ తో సంతకాలు చేయించి ఓటింగ్ కు వచ్చినట్లుగా హెడ్మాస్టర్ కు అందించి ఓటింగ్ ప్రక్రియ నియమ నిబంధనలను పాటించకుండా అక్రమ మార్గంలో నిర్వహించి వారికి అనుకూలమైన వారిని చైర్మన్ చేసుకోవడం పట్ల తీవ్ర విమర్శలకు దారి తీసింది అసలు విద్యా కమిటీ చైర్మన్ లో ఎన్నిక ఎలా నిర్వహించాలో దానికి అనుగుణంగా నిర్వహించకుండా తల్లిదండ్రులు లేకుండానే ఎన్నికలు నిర్వహించడం విద్యాశాఖ అధికారులు పాఠశాల అధికారులు ఏకపక్షంగా వ్యవహరించిన తీరుపై పలువురు తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు ఈ అంశంపై స్థానిక మండల విద్యాశాఖ అధికారులని వివరణ కోరగా తాను అందుబాటులో లేనని అక్కడ జరిగే ఎన్నిక నిర్వహణ ప్రధానోపాధ్యాయురాలు యొక్క పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు ఈ అంశంపైన జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్ సేవలు సకాలంలో అందాలి



- ఈహెచ్ఎస్ నిధుల జమపై ప్రభుత్వ నిర్ణయానికి ఏపీ జేఏసీ అమరావతి కృతజ్ఞతలు
- మెడికల్ రీయింబర్స్‌మెంట్ సీలింగ్ పెంచాలి
- ఎల్ఓసీ ప్రక్రియ సరళతరం చేయాలి

**విజయవాడ, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగుల వాటా, ప్రభుత్వ వాటా నిధులను ప్రతి నెలా 1వ తేదీన నేరుగా ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టుకు జమ చేసేలా ఉత్తర్వులు జారీ చేసినందుకు ముఖ్యమంత్రికి ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తర్వులు పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్ కింద సకాలంలో క్యాష్‌లెస్ వైద్యం అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.
ఐఏఎస్ అధికారులకు అమలు చేస్తున్న విధానంలోనే ఉద్యోగి లేదా పెన్షనర్ ఆసుపత్రిలో చేరిన వెంటనే అవసరమైన వైద్య ఖర్చుల్లో కొంత మొత్తాన్ని ఆసుపత్రికి జమ చేసే విధానం తీసుకురావాలని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ సీలింగ్ పెంచడంతో పాటు బిల్లుల ఆమోద ప్రక్రియను సరళతరం చేయాలని, ప్రస్తుతం క్లిష్టంగా ఉన్న ఎల్ఓసీ జారీ విధానాన్ని మార్చి సీఈఓ నేరుగా ఎల్ఓసీ జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు ఉద్యోగులు, పెన్షనర్లకు వార్షిక ఆరోగ్య పరీక్షలు వెంటనే ప్రారంభించాలని బొప్పరాజు, పలిశెట్టి దామోదరరావు కోరారు. అత్యవసర వైద్య పరిస్థితులు, ప్రమాదాల సమయంలో ఫోన్ ద్వారా ఈహెచ్ఎస్ అనుమతి పొందే విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈహెచ్ఎస్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో వివిధ ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన ఉద్యోగ వేదిక



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై ఓ టీవీ ఛానల్ న్యూస్ ప్రెజెంటర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉద్యోగ వేదిక చైర్మన్, ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జి. ఆస్కార్ రావు ఖండించారు. ఏపీపీఎస్సీ ద్వారా నియమితులైన సచివాలయ ఉద్యోగులను అవమానకరంగా సంబోధించడం అభ్యంతరకరమని, సంబంధిత ప్రెజెంటర్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంతో పాటు పెన్షన్ల పంపిణీ, వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలులో కీలకంగా పనిచేస్తున్నారని ఆస్కార్ రావు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై మీడియా పరిష్కారానికి వారధిగా నిలవాలని, అవమానకర వ్యాఖ్యలకు వేదిక కాకూడదన్నారు. సచివాలయ ఉద్యోగులు శాంతియుతంగా చేస్తున్న ఆందోళనల్లో లోపాలుంటే సూచించాలే తప్ప వారిని తీవ్రవాదులుగా చిత్రీకరించడం సరికాదని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై న్యాయపరమైన చర్యలను పరిశీలించాలని సచివాలయ ఉద్యోగుల జేఏసీని కోరారు.

## సెక్రటరీ సంఘం నాయకుల సస్పెన్షన్లు తక్షణమే ఎత్తివేయాలి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** స్వర్ణ గ్రామ–స్వర్ణ వార్డు సచివాలయ సంఘం నాయకులపై విధించిన సస్పెన్షన్లను తక్షణమే ఎత్తివేయాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఉద్యోగుల సమస్యలను ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్న సంఘ నాయకులపై కక్ష సాధింపు చర్యలు తగవని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేశవరపు జాలి రెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ జంషీద్ పేర్కొన్నారు. ఉద్యోగుల సేవా సమస్యలు, ఉద్యోగ భద్రత, వేతనాలు, ఇతర అంశాలను సంఘాల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమని తెలిపారు.
సచివాలయ సంఘం నాయకులపై సస్పెన్షన్లను ప్రభుత్వం పునఃపరిశీలించి వెంటనే ఎత్తివేయాలని వారు కోరారు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన సమయంలో క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం వల్ల ఉద్యోగుల్లో ఆందోళన పెరిగే అవకాశం ఉందన్నారు. సెక్రటరీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సానుకూలంగా చర్చలు జరిపి పరిష్కార మార్గం చూపాలని విజ్ఞప్తి చేశారు.

## నూతన 'డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్'గా డాక్టర్ వెంకటరమణ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రజారోగ్య శాఖ (డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్) ఇంఛార్జి సంచాలకులుగా డాక్టర్ వెంకట రమణ నియమించాలని ప్రభుత్వ నిర్ణయించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం తెలిపిన ఆమోదం మేరకు వెంకటరమణ డీహెచ్ గా అధికార బాధ్యతలు స్వీకరించనున్నారు. గత 33 నెలల నుంచి డీహెచ్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గా సేవలు అందించిన డాక్టర్ కె. పద్మావతి బుధవారం పదవీ విరమణ చేయనున్నారు. అడిషనల్ డైరెక్టర్ (ఎన్ఎల్ ఈపీ) హోదాలో పద్మావతి డీహెచ్ ఇంచార్జిగా వ్యవహరించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో ఆమె 37 ఏళ్ల పాటు వివిధ స్థాయిల్లో పని చేశారు.
**ఏడుగురి పేర్ల పరిశీలన :** ఈ పోస్టు భర్తీ కోసం ఏడుగురు అధికారుల పేర్లను మంత్రిత్వ శాఖ సూచించింది. వీరిలో ఇద్దరిపై నమోదైన ఆరోపణలపై విచారణ సాగుతోంది. మరో ఇద్దరికి కీలకమైన డీఎంఅండ్ హెచ్ఓగా పనిచేసిన అనుభవంలేదు. ఒకరు కేవలం మూడు నెలలు మాత్రమే డీఎంఅండ్ హెచ్ ఓగా (అదనపు బాధ్యతలు) పనిచేశారు. మరోకరు జూన్ మాసంలో పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో డీపీహెచ్ గా వెంకటరమణ నియామకం జరిగింది. ఈయన ప్రస్తుతం డీపీహెచ్ కార్యాలయంలో అదనపు డైరెక్టర్ (డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం)గా పనిచేస్తున్నారు.

## మరో నెలలో కొత్త పింఛన్ల మంజూరు : మంత్రి కందుల దుర్గేష్

- నిడదవోలు నియోజకవర్గంలో రూ.28.89 కోట్లతో 24 రహదారి పనులకు శంకుస్థాపన
- త్వరలో ఇళ్ల స్థలాల పంపిణీ



**నిడదవోలు, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్):** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నిడదవోలు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఏపీ రూరల్ రోడ్స్ స్ట్రెంతెనింగ్ ప్రాజెక్ట్ కింద రూ. 28.89 కోట్లతో చేపట్టనున్న 45 కిలోమీటర్ల పొడవైన 24 రహదారి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. నిడదవోలు రూరల్ మండలం పందలపర్రు, పెరవలి మండలం ఉసలుమర్రు, ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామాల్లో మంత్రి పర్యటించి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. నిడదవోలు మండలంలో 14 కిలోమీటర్ల పొడవైన 10 రహదారి పనులకు రూ. 9.44 కోట్లు, పెరవలి మండలంలో 12 కిలోమీటర్ల పొడవైన 6 పనులకు రూ. 6.25 కోట్లు, ఉండ్రాజవరం మండలంలో 18 కిలోమీటర్ల పొడవైన 8 పనులకు రూ. 13.20 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. పందలపర్రు గ్రామంలో రహదారుల అభివృద్ధికి సుమారు రూ. 3 కోట్లు కేటాయించామని, ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ఏటిగట్టు వరకు రహదారి నిర్మాణానికి రూ. 1.24 కోట్లు, పందలపర్రు నుంచి రావివారిపాలెం రహదారికి రూ. 2 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.
కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగిస్తోందని దుర్గేష్ పేర్కొన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటికే పల్లె పండుగ ద్వారా పలు రహదారి పనులు చేపట్టామని తెలిపారు.
కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరించామని, మరో నెల రోజుల్లో పింఛన్లు మంజూరు చేస్తామని చెప్పారు. త్వరలో ఇళ్ల స్థలాలు, ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని, గతంలో నిలిచిపోయిన గృహసముదాయాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పందలపర్రులో అభయాంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించిన మంత్రి, వంగవీటి మోహనరంగ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## ఈహెచ్ఎస్ వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలి

- ఉద్యోగులకు నాణ్యమైన నగదు రహిత వైద్యం అందించాలి
- ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఈహెచ్ఎస్ ద్వారా నాణ్యమైన, నిరంతరాయమైన క్యాష్‌లెస్ వైద్య సేవలు అందేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ కోరారు.
ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్‌లో మంగళవారం జరిగిన ఈహెచ్ఎస్ సమావేశంలో ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ పాల్గొన్నారు. నూతనంగా సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన పద్మావతికి రాష్ట్ర కమిటీ తరపున శుభాకాంక్షలు తెలిపారు.
ఉద్యోగుల నుంచి వసూలు చేస్తున్న ఉద్యోగుల వాటాతో పాటు ప్రభుత్వ వాటాను నేరుగా ట్రస్ట్‌కు బదిలీ చేసేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉద్యోగుల పక్షాన స్వాగతిస్తున్నట్లు విద్యాసాగర్ తెలిపారు. ఈ నిర్ణయానికి సీఈవోకు ధన్యవాదాలు తెలిపారు. ఈహెచ్ఎస్ పరిధిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న వైద్య సమస్యలను పరిష్కరించి, క్యాష్‌లెస్ వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ఈహెచ్ఎస్ ప్యాకేజీ రేట్లను సవరించడం, వార్షిక ఆరోగ్య పరీక్షల విధానాన్ని ప్రారంభించడం, వైద్య ఖర్చుల బిల్లుల పరిష్కారంలో జాప్యాన్ని తగ్గించడం, ఈహెచ్ఎస్ ఆసుపత్రుల్లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలను సమావేశంలో ప్రస్తావించారు.
విశ్రాంత సీపీఎస్ ఉద్యోగులకు కూడా ఈహెచ్ఎస్ సదుపాయాన్ని వర్తింపజేసి, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య భద్రత కల్పించాలని కోరారు. ఇందుకోసం వారు చెల్లించాల్సిన ఒకేసారి చెల్లించే మొత్తాన్ని త్వరితగతిన నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు.
**అక్టోబర్ రెండో వారంలో ఉమ్మడి సమావేశం:** ఉద్యోగ సంఘాలు, ఆసుపత్రుల యాజమాన్యాలతో అక్టోబర్ రెండో వారంలో ఉమ్మడి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ఈహెచ్ఎస్ సీఈవో పద్మావతి హామీ ఇచ్చారు. వైద్య పరిమితి సీలింగ్‌ను పెంచడం, ఈహెచ్ఎస్ ప్యాకేజీ రేట్లను సవరించడం, నగదురహిత హెల్త్ కార్డుల ద్వారా సమగ్ర వైద్య సేవలు అందించడం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు డిజిటల్ హెల్త్ కార్డులు అందజేస్తామని సీఈవో తెలిపారు. పూర్తి స్థాయిలో క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించేందుకు ఉద్యోగుల కంట్రిబ్యూషన్ పెంచాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.
ఈహెచ్ఎస్ విధానాన్ని మరింత బలోపేతం చేసి ఉద్యోగులు, పెన్షనర్లకు సులభతరమైన, నాణ్యమైన, పారదర్శకమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ కోరారు.
మంగళగిరిలోని ఆరోగ్యశ్రీ హెల్త్ ట్రస్ట్ కార్యాలయంలో ఈహెచ్ఎస్ సీఈవో పద్మావతి అధ్యక్షతన జరిగిన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ మేనేజ్మెంట్ కమిటీ సమావేశంలో ఏపీ ఎన్జీజివో జీవో సంఘ ప్రధాన కార్యదర్శి డి వి రమణ, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి హృదయ రాజు, పిఆర్టియు రాష్ట్ర సంఘ అధ్యక్షుడు శఎం కృష్ణయ్య, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ మహిళా విభాగం నాయకురాలు రాజ్యలక్ష్మి, విజయవాడ నగర శాఖ అధ్యక్షులు సి.వి. ఆర్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పండుగ-3.0లో భాగంగా అభివృద్ధి పనులకు శ్రీకారం

- అమృతలూరు ఎస్సీ కాలనీలో రూ.50 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



**అమృతలూరు, సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ ఫైల్):** పల్లె పండుగ-3.0లో భాగంగా అమృతలూరు మండలం అమృతలూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ. 50 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. రహదారి నిర్మాణంతో కాలనీలోని ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.
గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని నక్కా ఆనంద బాబు తెలిపారు. పల్లె పండుగ-3.0 ద్వారా గ్రామాల్లో ప్రజలకు నేరుగా ఉపయోగపడే రహదారులు, ఇతర మౌలిక వసతుల పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వేమూరు నియోజకవర్గంలోని అమృతలూరు, భట్టిప్రోలు, కొల్లూరు, త్సుండూరు, వేమూరు మండలాల్లో VB-G RAM G కింద 71 మెటీరియల్ పనులకు రూ. 10.42 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలనా అనుమతులు మంజూరైనట్లు తెలిపారు. ఈ పనుల్లో 69 సీసీ రోడ్లు, 2 గ్రావెల్ రోడ్లు ఉన్నాయి. అమృతలూరు మండలంలో 20 పనులకు రూ. 2.32 కోట్లు, భట్టిప్రోలులో 14 పనులకు రూ. 2.10 కోట్లు, కొల్లూరులో 12 పనులకు రూ. 2.10 కోట్లు, త్సుండూరులో 13 పనులకు రూ. 2.60 కోట్లు, వేమూరులో 12 పనులకు రూ. 1.30 కోట్లు కేటాయించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రాముడు, శివుడిపై రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ మాధవ్ అభ్యంతరం



- "శివుడు, విష్ణువు, శక్తి ఒకే పరమ సత్యానికి ప్రతిరూపాలు"
- భారతీయ ధర్మం, సంస్కృతిని అర్థం చేసుకోకుండా వ్యాఖ్యలు సరికాదు
- ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీరాముడు, శివుడిపై చేసిన వ్యాఖ్యలకు ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పందించారు. ఢిల్లీలో రేవంత్ రెడ్డి ఉత్తర--దక్షిణ భారత రాజకీయ, మత గుర్తింపుల సందర్భంలో శ్రీరాముడు ధనికుల దేవుడని, శివుడు పేదల దేవుడని వ్యాఖ్యానించడంతో ఈ అంశంపై రాజకీయ వివాదం నెలకొంది. మీడియాతో మాట్లాడిన పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, పవిత్రమైన అంశాలపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. శివుడు, విష్ణువు, శక్తి ఒకే పరమ సత్యానికి ప్రతిరూపాలని, భారతీయ తత్వశాస్త్రం దేవతల మధ్య భేదాన్ని చూడదని పేర్కొన్నారు. భారతీయ ధర్మం, జీవన విధానం, సంస్కృతికి సంబంధించిన ప్రాథమిక అంశాలను అర్థం చేసుకోకుండా ఈ విషయాలపై మాట్లాడటం సరికాదన్నారు. శ్రీరాముడిని బీజేపీ ఎన్నికల లేదా రాజకీయ ప్రయోజనాల కోసం చిహ్నంగా ఉపయోగించలేదని మాధవ్ అన్నారు. శ్రీరాముడు భారతీయుల గర్వానికి, జాతీయతకు ప్రతీకగా తమ పార్టీ భావిస్తుందని తెలిపారు. ప్రజలకు సుపరిపాలన, సంక్షేమం, సమృద్ధిని అందించే పాలనను 'రామరాజ్యం'గా పేర్కొంటామని, దేశం ప్రపంచానికి మార్గనిర్దేశం చేసే స్థాయికి ఎదగాలన్నదే తమ ఆకాంక్ష అని చెప్పారు.

## కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి గడువు

- అర్హత కలిగిన ఉపాధ్యాయులు, లెక్చరర్లు ఫారం-19లో దరఖాస్తు చేసుకోవాలి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటరు జాబితా తయారీకి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో అర్హత కలిగిన ఉపాధ్యాయులు, లెక్చరర్లు నవంబర్ 6లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి, ఓటరు నమోదు అధికారి తెలిపారు. ఓటరు జాబితాలను ప్రతి ఎన్నికకు ముందు కొత్తగా రూపొందించాల్సి ఉన్నందున అర్హులైన వారు నిర్ణీత ఫారం-19లో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. అర్హత తేదీ నవంబర్ 1, 2026గా పేర్కొన్నారు.
బాపట్ల, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల్లోని ప్రభుత్వ, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన ఉపాధ్యాయులు, లెక్చరర్లు నమోదు చేసుకోవచ్చు. దరఖాస్తుదారు భారత పౌరుడై ఉండటంతో పాటు సంబంధిత నియోజకవర్గంలో నివసిస్తూ ఉండాలి. నవంబర్ 1, 2026 నాటికి గత ఆరు సంవత్సరాల్లో కనీసం మూడు సంవత్సరాలు ఉన్నత పాఠశాల లేదా కళాశాలలో ఉపాధ్యాయుడు/లెక్చరర్‌గా పనిచేసినట్లు సంస్థ అధిపతి ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ప్రస్తుతం బోధనా వృత్తిలో లేని వారు చివరిగా పనిచేసిన సంస్థ అధిపతి నుంచి ధ్రువీకరణ పొందాలి.
దరఖాస్తుతో ఫారం-19, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు గుర్తింపు కార్డు వివరాలు, అందుబాటులో ఉంటే ఆధార్ వివరాలు సమర్పించాలి. ప్రభుత్వ సంస్థల ఉపాధ్యాయులు, లెక్చరర్లు సంబంధిత అధికారుల ధ్రువీకరణతో దరఖాస్తు చేయాలి.
ప్రైవేట్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ సంస్థల్లో పనిచేసేవారు సంస్థ అధిపతి ధ్రువీకరణతో పాటు డీఈఓ, ఆర్ఐఓ లేదా ఆర్‌జేడీ కౌంటర్ సంతకం పొందాలి. దరఖాస్తులను జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయం, సబ్‌కలెక్టర్/ఆర్‌డీఓ, తహశీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో ఆఫ్‌లైన్‌లో సమర్పించవచ్చు.
ఫారం-19ను ఆయా కార్యాలయాల నుంచి పొందవచ్చు. ఆన్‌లైన్‌లో www.ceoandhra.nic.in ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు 1950 టోల్‌ఫ్రీ నంబర్‌ను లేదా స్థానిక తహశీల్దార్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

## మలేరియా కేసుల నియంత్రణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- కేసులు పెరిగిన తర్వాత మేల్కొనడం కాదు.. ముందే గుర్తించి అడ్డుకోవాలి
- ఒక్క మలేరియా మరణం కూడా జరగకూడదు
- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధరబాబు స్పష్టీకరణ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో మలేరియా కేసుల నియంత్రణలో నిర్లక్ష్యం, అలసత్వం, జాప్యాన్ని ఎంతమాత్రం సహించేది లేదని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధరబాబు అధికారులను హెచ్చరించారు. కేసులు పెరిగిన తర్వాత స్పందించడం అధికారుల పని కాదని.. కేసులు పెరగకుండా ముందే గుర్తించి అడ్డుకోవడమే బాధ్యత అని స్పష్టం చేశారు. ఒక్క మలేరియా కేసును కూడా తేలికగా తీసుకోవద్దని, ముఖ్యంగా గిరిజన, మారుమూల, అధిక ప్రమాద ప్రాంతాల్లో అప్రమత్తతను మరింత పెంచాలని ఆదేశించారు.
ముందస్తు నిఘా.. సత్వర పరీక్షలు.. సకాలంలో చికిత్స.. దోమల నియంత్రణ.. మందుల పూర్తి లభ్యత.. ఈ ఐదు అంశాల్లో ఎక్కడా లోపం ఉండకూడదని చక్రధరబాబు స్పష్టం చేశారు.
విజయవాడలో మంగళవారం జరిగిన 28 జిల్లాల అధికారుల రాష్ట్రస్థాయి కార్యశాలలో మలేరియా పరిస్థితి, వ్యాధుల నిఘా, క్షేత్రస్థాయిలో దోమల నియంత్రణ, మందుల లభ్యత, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఐహెచ్ఐపీ–ఐడీఎస్‌పీ సమాచారం, ఏవేర్, ఏడీఎస్ వ్యవస్థల వినియోగం, క్రియాశీల--సాధారణ నిఘా, దోమల నియంత్రణ చర్యలు, మలేరియా నివారణ మందుల నిల్వలు, సిబ్బంది సామర్థ్య పెంపుపై చర్చించారు.
ప్రతి జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఏ ప్రాంతంలో కేసులు పెరుగుతున్నాయో ముందుగానే గుర్తించి, అక్కడ వెంటనే నియంత్రణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.
**కేసులు పెరిగే వరకు చూస్తే కుదరదు**
మలేరియా కేసులు పెరిగిన తర్వాత చర్యలు ప్రారంభించడం అంటే జాప్యమేనని కమిషనర్ స్పష్టం చేశారు. వ్యాధి వ్యాప్తికి సంబంధించిన తొలి సంకేతాలు కనిపించిన వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని ఆదేశించారు. సమాచారం అందిన తర్వాత కూడా చర్యలు తీసుకోకపోతే దాన్ని నిర్లక్ష్యంగా పరిగణించాల్సి వస్తుందని హెచ్చరించారు.
గిరిజన ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో జ్వరకేసులపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. జ్వరం వచ్చిన ప్రతి వ్యక్తికి అవసరమైన పరీక్షలు నిర్వహించి, మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించాలని సూచించారు. మారుమూల ప్రాంతం కావడంతో కేసు ఆలస్యంగా గుర్తించే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు.
**సమాచారం వస్తే.. వెంటనే చర్య ఉండాలి**
ఐహెచ్ఐపీ–ఐడీఎస్‌పీ ద్వారా అందుతున్న సమాచారాన్ని నిరంతరం పరిశీలించి, దాని ఆధారంగా ప్రమాద ప్రాంతాలను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. ఏవేర్, ఏడీఎస్ వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించి ముందస్తు నిఘాను మరింత బలోపేతం చేయాలని సూచించారు. మలేరియా కేసుల గుర్తింపులో క్రియాశీల, సాధారణ నిఘా రెండూ బలంగా ఉండాలని కమిషనర్ అన్నారు. కేసులను గుర్తించడంతో పాటు దోమల పరిస్థితిని కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.
మలేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో దోమల నియంత్రణ చర్యలను వెంటనే, యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ఏఎల్ఓ, ఐఆర్ఎస్, ఐఎస్ఎస్, పొగ పిచికారీ వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. కేసులు పెరిగిన తర్వాత చర్యలు చేపట్టడం కాదు.. కేసులు పెరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందే గుర్తించి నియంత్రణ చర్యలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
**మందులు లేకపోతే బాధ్యత ఎవరిది?**
మలేరియా పరిస్థితిని బట్టి మందుల అవసరాన్ని ముందుగానే అంచనా వేసి తగినంత నిల్వలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కేసు వచ్చిన తర్వాత మందుల కోసం వెతికే పరిస్థితి ఎంతమాత్రం ఉండకూడదని స్పష్టం చేశారు. మలేరియా నివారణ మందుల లభ్యత, నిల్వలపై సమావేశంలో ప్రత్యేకంగా సమీక్ష జరిగింది. కేటాయించిన నిధులను నిర్దిష్ట వ్యవధిలోగా వినియోగించాలని స్పష్టం చేశారు. ముందస్తు ప్రణాళికను సక్రమంగా రూపొందించకపోవడం వల్లే నిధుల వినియోగంలో వెనుకబడుతున్నారని పేర్కొన్నారు.
**సిబ్బంది క్షేత్రస్థాయి పనితీరుపై అధికారులు నిఘా పెట్టాలి**
మలేరియా నియంత్రణలో పనిచేస్తున్న సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని, వారు క్షేత్రస్థాయిలో సక్రమంగా పనిచేస్తున్నారా లేదా అన్నది అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. కాగితాలపై నివేదికలు కాకుండా.. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించాలని స్పష్టం చేశారు.
మలేరియాతో పాటు కాలాజార్, ఫైలేరియా వ్యాధుల వివరాలను కూడా పక్కాగా నమోదు చేసి ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. సమాచారం, నివేదికల్లో జాప్యం చేయవద్దని, ఏ స్థాయిలోనైనా నిర్లక్ష్యం బయటపడితే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.
**ఒక్క మలేరియా మరణం కూడా జరగకూడదు**
మలేరియా నియంత్రణలో నిర్లక్ష్యానికి తావులేదని, జాప్యాన్ని సహించేది లేదని కమిషనర్ కె.వి.ఎన్. చక్రధరబాబు స్పష్టం చేశారు. కేసులు పెరిగే వరకు వేచి చూడొద్దని.. ముందే గుర్తించాలి.. వెంటనే స్పందించాలి.. వ్యాధిని అక్కడికక్కడే అడ్డుకోవాలని ఆదేశించారు.
ముఖ్యంగా గిరిజన, మారుమూల, అధిక ప్రమాద ప్రాంతాల్లో అధికారులు మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఒక్క మలేరియా మరణం కూడా జరగకుండా ప్రతి అధికారి, ప్రతి సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని చక్రధరబాబు స్పష్టం చేశారు.
సమావేశంలో ప్రజారోగ్య శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ వెంకటరమణ, జాయింట్ డైరెక్టర్ అర్జునరావు, డిప్యూటీ డైరెక్టర్ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com